₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 12

జూన్ 16-30, 2018



## ప్రతిదీ పార్టీ రాజకీయమేనా?



## ఏపీలో ఉపద్రవం రాలేదు, తెలంగాణాలో అద్భుతాలూ జరగలేదు





# విద్య బాగుతోనే యువత బాగు



దేశ జనాభాలో అత్యధికులుగా ఉన్న యువతకు ఉపాధి దొరకక పోవటానికి ఏ దేవుడి శాపమో, తలరాతో కారణం కాదని... నాణ్యమైన విద్యనందించని పాలన, విధానాలే ఇందుకు ప్రధాన కారణమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రపంచంలో మరే దేశంలోనూ లేనంత అధ్వాన్న చదువులు మనదేశంలో ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా ఏటా 1.30 కోట్లమంది నిరుద్యోగ యువత కొత్తగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. విద్యాప్రమాణాలను బాగు చేయకుంటే ఈ భారీవిపత్తును ఎదుర్కోవటం సాధ్యం కాదన్నారు. హైదరాబాద్ శంషాబాద్ పరిధి ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్-ముప్పవరపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిభ పురస్కారాల ప్రదానం, నైపుణ్యాల శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా జేపీ పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, తెలంగాణ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, బీజేపీ నేతలు డా॥ లక్ష్మణ్, జి.కిషన్ రెడ్డి, టి.ప్రకాష్‌గౌడ్, సినీ హీరో నాగార్జున తదితరులు పాల్గొన్నారు. దేశానికి స్వతంత్రం సిద్ధించి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా, నేటికీ 22 శాతం ప్రజలు నిరక్షరాస్యులుగా, 25 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువగా ఉండటం దురదృష్టకరమని వెంకయ్యనాయుడు అన్నారు. స్వయంఉపాధిపై యువత దృష్టి పెట్టాలని, పరాజయం నుంచి గుణపాఠం నేర్చుకుని ఎదగాలని సూచించారు. రాజకీయాల్లో నైతిక విలువలు కనుమరుగవుతున్నాయని మహమూద్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. లాభాపేక్ష లేకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో సేవలందిస్తున్నారని స్వర్ణభారత్ ట్రస్ట్‌ను అభినందించారు. స్వర్ణభారత్ స్ఫూర్తితోనే అన్నపూర్ణ సంస్థ ఆధ్వర్యంలో సినీరంగంలో కళాకారులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని నాగార్జున తెలిపారు. స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం సివిల్స్ టాపర్ అనుదీప్‌ను ఉపరాష్ట్రపతి ఘనంగా సత్కరించారు.





జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

జూన్ 16-30, 2018 సంపుటి - 9 సంచిక - 12

## కార్టూన్ కార్నర్



నేను ఎన్ని తప్పులు చేసినా ఎంత అవినీతి చేసినా
మన కులం కోసమే.. మీరు ఉన్నారన్న అండతోనే

## లోపలి పేజీల్లో...

ప్రతిదీ పార్టీ రాజకీయమేనా? ..................... 5
ఏపీలో ఉపద్రవం రాలేదు, తెలంగాణలో......... 6
తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో .............13
ఉత్తరాంధ్రకు ఏం చేశారో చెప్పండి...............16
ఒప్పంద సేద్యంపై కేంద్రం కొత్త చట్టం............. 17
తెలంగాణ గణాంకాలు - దార్శనిక పత్రం......... 20
తెలంగాణ గణాంక దర్శిని - 2016 ............. 21
దార్శనిక పత్రానికి తెలంగాణ రాష్ట్ర పథకాలు... 22
31 జిల్లాల సమాచారంతో తెలంగాణ .......... 25
నిరుద్యోగంలో కళ్లు చెదిరే వృద్ధి..................... 28
సమాజహితం కోరేవారైతేనే సివిల్స్‌కు ........... 32

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

### చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# కోల్పోయిన రిపబ్లిక్‌ను సాధించుకోవాలి



**1977** నాటి పరిస్థితులే మళ్లీ ఇప్పుడు దేశ రాజకీయాల్లో కనిపిస్తున్నాయనే అంచనాలు పెరుగుతున్నాయి. ఎమర్జెన్సీ విధించిన కాంగ్రెస్ ప్రధానమంత్రి ఇందిరను ఆనాడు ప్రతిపక్షాలన్నీ ఏకమై ఓడించినట్టు ఇప్పుడు బీజేపీ/ఎన్డీయే ప్రధాని నరేంద్రమోదీని ఓడించాలని పిలుపులు మొదలయ్యాయి. 2019 ఎన్నికలకు ఇదే భేషైనవ్యూహమని జాతీయస్థాయి గుర్తింపు ఉన్న మహారాష్ట్రకు చెందిన ఓ సీనియర్ నేత తేల్చిచెప్పారు. దేశ రాజకీయాలను మలుపు తిప్పిన ఓ పెద్ద పరిణామాన్ని పునరావృతం చేయాలని ఇలా ప్రతిపక్షంలో పలువురు ఆశపడతున్నారు. కానీ రాజకీయ నేతలకు, పార్టీలకు మాత్రమే వదిలేయాల్సిన విషయం కాదిది! అలా వదిలేస్తే.. చరిత్ర పునరావృతం ఓ ప్రహసనంగా మిగిలిపోయి జాతి మరోసారి మోసపోయే ప్రమాదముంది. 1975 జూన్ 25న ఇందిర ప్రభుత్వం ప్రకటించిన ఎమర్జెన్సీ.. నాలాంటి అనేకమంది యువత జీవితాలపై పెనుప్రభావం చూపింది. ఎమర్జెన్సీ నిర్ణయం గురించి స్వదేశీ మీడియాకు కూడా తెలియదు. బీబీసీ ద్వారా ఆ వార్తను తెలుసుకున్నాను. డాక్టర్‌గా సమాజానికి వీలైనంత సేవ చేస్తూ జీవితాన్ని ఆస్వాదించాలనుకున్న నా గమనాన్ని మార్చి.. ఈ దేశంలో సంపూర్ణ ప్రజాస్వామిక విప్లవం కోసం దశాబ్దాల తరబడి పోరాడే పౌరునిగా, ఐఏఎస్‌గా, ఉద్యమకారునిగా, రాజకీయవేత్తగా మార్చింది ఎమర్జెన్సీ! ఎమర్జెన్సీ ప్రకటించిన నాటి నుంచి.. మా మెడికల్ కళాశాల హాస్టల్‌లో జరిగిన చర్చలు, ఉడుకు నెత్తురు ప్రసంగాలు అన్నీ ఇన్నీ కావు. ఎన్నో నిద్రలేని రాత్రులు! దేశం కోసం హాస్టల్ మూడో అంతస్తు నుంచి దూకండని లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిస్తే.. మరో ఆలోచన లేకుండా దూకటానికి మాలో ప్రతి ఒక్కరం సిద్ధం. ఇలాంటి తరుణంలో 1977 ఎన్నికల ప్రకటన వచ్చింది. ఢిల్లీకి 1000 కిలోమీటర్ల పరిధిలో ఒక్కటంటే ఒక్క సీటూ గెల్చుకోకుండా కాంగ్రెస్ పార్టీ ఘోరపరాజయం పాలైంది. జనతా ప్రభుత్వం వచ్చింది, వ్యక్తిగతంగా నిజాయతీపరులైన గొప్ప నాయకులు అధికారంలోకి వచ్చారు, ఇక భారతదేశానికి ఢోకా ఉండదని ఎన్నో కలలు గన్నాం. కానీ మా ఆశలు వమ్మవుతున్నాయని గుర్తించటానికి ఎక్కువ సమయం పట్టలేదు. దీంతో.. ఎంబీబీఎస్ పూర్తయినా నేను డాక్టర్ వృత్తిలోకి వెళ్లకుండా సంపూర్ణ మార్పు కోసం తొలి అడుగుగా ఐఏఎస్‌లోకి ప్రవేశించాను. ఆ తర్వాత లోక్‌సత్తా ఉద్యమం, పార్టీ. ఇలా దాదాపు 44 ఏళ్లుగా భారతదేశంలో మార్పునే కలగంటున్నాను, అదే తింటున్నాను, అదే మాట్లాడుతూ అందుకోసమే పనిచేస్తున్నాను. మళ్లీ ఇప్పుడు 1977 తరహా రాజకీయ సమీకరణాల్ని ముందుకు తెస్తే.. ఎందుకు జనతా ప్రయోగం విఫలమైందన్న మౌలిక ప్రశ్నతోనే అది మొదలవ్వాలి. ఎమర్జెన్సీ పరిణామాలకు-ప్రస్తుత రాజకీయాలకు మధ్య ఉన్న పోలికను పలువురు సీనియర్ రాజకీయ నాయకులు బాగానే గుర్తించారు. ఇందిర తర్వాత అంత పెద్దఎత్తున ప్రజాదరణతో ఎన్నికైన నాయకుడు మోదీ. ఇందిర లాగే బలమైన, వెరుపు లేకుండా నిర్ణయాలు తీసుకోగల, జనాన్ని కదిలించగల నాయకుడాయన. తనను తాను ఇందిరతో పోల్చుకోవటం ఆయనకు ఎంతో ఇష్టం కూడా. అయితే మోదీ ఎన్నికయ్యింది మాత్రం- ఇందిర పాలనకు భిన్నమైన పాలననిస్తాననే హామీతో! 1977లో జనతా పార్టీ నుంచి ఆశించినట్టు మోదీ నుంచి కూడా ప్రజలు ఎంతో ఆశించారు. కానీ నాటి జనతా పార్టీ నేతల్లాగే మోదీ కూడా ఈ మహాకార్యంలో విఫలమయ్యారు. ప్రధానమంత్రిగా దేశానికి విజయాల్ని చేకూర్చటం మీద కాకుండా.. బీజేపీకి విజయాల్ని చేకూర్చి దేశవ్యాప్తం చేయటానికి ఆయన ప్రాధాన్యతనిచ్చారు. ఇందిరాగాంధీని గద్దె దించితే చాలు, దేశమంతా బాగుపడిపోతుందని ఆనాడు లోక్‌నాయక్ జేపీ సహా పలువురు నాయకులు భ్రమపడ్డారు. నాయకుల మార్పు తప్ప విధానాల మార్పు ఎజెండా కాకపోవటం వల్ల వ్యక్తిగతంగా నిజాయతీపరులైన నాయకులున్నా కూడా జనతా ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. అలాగే గత పాలకుల్లాగానే వ్యవహరిస్తూ.. ఎలాంటి వ్యవస్థీకృత మార్పునూ సాధించకపోవటం వల్ల ఈవేళ మోదీ విఫలమయ్యారు. జనతా ప్రభుత్వంలో భాగస్వామిగా కొనసాగిన చరిత్ర కూడా బీజేపీకి ఉన్నా.. చట్టబద్ధ పాలన లేకపోవటం, అధికారాలన్నీ కేంద్రీకృతం కావటం, అధికారులు ప్రజల్ని ద్వితీయ శ్రేణి పౌరుల్లా చూడటం, మీడియాను గుప్పెట్లో పెట్టుకోవటం.. వంటివి ఎమర్జెన్సీ తరహాలోనే ఇప్పుడూ కొనసాగుతున్నాయి. భూ కబ్జాలు చేసి బాధితుల నోరు నొక్కేస్తున్నారు, సామాన్యులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు కూడా చేయలేకపోతున్నారు, అత్యాచారాలకు అదుపు లేదు, వార్తాహరులే వార్తలుగా మారిపోతున్నారు, మార్గాలు మాత్రమే అయిన పార్టీలు లక్ష్యాలుగా మారిపోయాయి. రాజకీయంగా, చట్టసభ సభ్యుల సంఖ్య పరంగా జనతా కంటే మోదీ ప్రభుత్వం బలంగా ఉన్నా.. ఇందిరకు భిన్నంగా వ్యవస్థీకృత మార్పుల్ని తీసుకురావటంలో విఫలమైంది. 'ఎమర్జెన్సీ వల్ల రైళ్లు సరిగా నడుస్తున్నాయి, ప్రభుత్వోద్యోగులు టైంకి వచ్చి ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేస్తున్నారు' అని చెప్పుకుని జనం ఆనందపడటమూ అప్పట్లో కనిపించింది. కానీ ప్రజలెంతగా కోరుకుంటున్నా.. ఈనాటికీ ప్రభుత్వోద్యోగుల చేత ప్రజలకు సేవలు చేయించటానికి 'పౌర సేవల' చట్టాన్ని ఏ పార్టీ పాలకులూ తీసుకురాలేకపోయారు. మోదీకి ముందు జాతీయస్థాయిలో, ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లోనూ ప్రచ్ఛన్న ఎమర్జెన్సీ పాలననే అందిస్తున్న ప్రతిపక్షాలు.. ఏ రకంగా మోదీ పాలనను సవాలు చేస్తాయి? వారి వద్ద ఉన్న ప్రత్యామ్నాయ రాజకీయం ఏమిటి? 1975 తరహా ఎమర్జెన్సీని మళ్లీ విధించే సాహసాన్ని కాంగ్రెస్ సహా ఏ పార్టీ చేయకపోవచ్చు. 44వ రాజ్యాంగ సవరణ వచ్చాక రాష్ట్రాల ఆమోదం లేకుండా అత్యయిక పరిస్థితిని విధించటం సాధ్యం కూడా కాదు. కానీ పైకి ఇందిరను మాత్రమే ఎమర్జెన్సీ విలన్‌గా చూపుతూ లోలోపల అదే ఎజెండాను అన్ని ప్రాచుర్య పార్టీలూ అమలు చేస్తున్నాయి. 1977లో ఇందిరను గద్దె దించినట్టు మోదీని కూడా గద్దె దించుతామని ఈవేళ ప్రతిపక్షాలన్నీ చెబితే మనకేమీ అభ్యంతరం ఉండాల్సిన పన్లేదు. కానీ వాటి ప్రత్యామ్నాయ విధానాలేమిటని ప్రశ్నించి తీరాలి. లేకి చర్చలు, చౌకబారు డ్రామాల స్థానంలో.. ఈ ప్రశ్నకు కచ్చితమైన జవాబుల్ని చర్చించాలి, తేల్చాలి. అప్పుడే మోదీ ప్రభుత్వ వైఫల్యం-ప్రతిపక్షాల అవకాశవాదం మధ్య చిక్కుకోకుండా లాభపడగలుగుతాం. చట్టబద్ధ పాలన, అధికార వికేంద్రీకరణతో ఫెడరలిజం విస్తరణ-స్థానిక సాధికారత, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా ప్రజలకు సేవలు, అందుబాటులో నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, తేలిగ్గా న్యాయం, అవినీతి నిర్మూలనకు బలమైన ఏర్పాట్లు, సమర్థులు-నిజాయతీపరులు ఎన్నికల్లో గెలవటం వంటి 'వ్యవస్థీకృత మార్పుల్ని' సాధించగలుగుతాం. ఇప్పుడు దేశంలో ఎమర్జెన్సీ తర్వాత పుట్టిన యువజనాభా ఎక్కువుంది. తమ ప్రయోజనమేమిటో గుర్తిస్తే చాలు.. ఆధునిక సమాచార సాంకేతిక యుగంలో ఈ మార్పు ఎజెండా కోసం వీళ్లు అవగాహనతో పోరాడి గెలవగలరు. విధానాలులేని రాజకీయం వల్ల కోల్పోయిన రిపబ్లిక్‌ను సాధించుకోవటమే ఇప్పుడు ఇండియా ముందున్న లక్ష్యం.

# ప్రతిదీ పార్టీ రాజకీయమేనా?

అన్ని పార్టీల మధ్య, ప్రజలందరి మధ్యా ఏకాభిప్రాయం ఉండాల్సిన అంశాల మీద.. వాస్తవాలు, గణాంకాల ప్రాతిపదికన మాత్రమే అంచనా వేయాల్సిన అంశాల మీద కూడా పార్టీ రాజకీయాలు చేస్తున్నారని, దీనివల్ల చివరకు అందరూ నష్టపోయే పరిస్థితి వస్తుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ హెచ్చరించారు.

తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో విద్యార్థులతో కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు బాలసుబ్రహ్మణ్యం కూడా పాల్గొన్నారు.

ప్రత్యేకహోదా అంటే ఏమిటో కూడా ప్రజల్లో అవగాహన పెంచకుండా, హోదాపై సకాలంలో స్పందించకుండా ప్రధాన పార్టీలు ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం వాడుకునే ప్రయత్నం చేస్తున్నాయని జేపీ అన్నారు. పేరు ఏదైనా ప్రత్యేకహోదా సహా ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన అన్ని నిధుల్నీ కేంద్రం నుంచి పూర్తిస్థాయిలో పొందటానికి అందరూ కలిసికట్టుగా పోరాడాలన్నారు. రాష్ట్ర విభజన వల్ల హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే పరిశేష ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భవిష్యత్తును పరిరక్షించటం కోసం అప్పట్లోనే తానే ప్రత్యేకహోదా ప్రతిపాదన చేశానని, ఓట్లు, సీట్లు లేకపోయినా తెలుగు ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు లోక్‌సత్తా తన వంతు కృషి చేస్తూనే ఉందని వివరించారు. ఈ క్రమంలోనే..




విభజన నేపథ్యంలో ఏపీకి రావాల్సిన నిధులను నిగ్గుతేల్చేందుకు పార్టీలకతీతంగా వివిధ రాష్ట్రాలకు చెందిన స్వతంత్ర నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహాలో నిధులిస్తామని చెప్పి ఏడాదికి జిల్లాకు రూ. 50 కోట్లు కేటాయిస్తున్నారని, వాస్తవంగా రూ. 30,000 కోట్లు రావాలని జేపీ అన్నారు. ఏడాదికి ఏపీకి రావాల్సిన రూ. 3,820 కోట్ల పన్నుల ఆదాయం తెలంగాణకు వెళ్తోందని, చట్టంలో ఈ తప్పిదాన్ని కేంద్రమే చేసింది కాబట్టి కేంద్రప్రభుత్వమే ఈ డబ్బును ఆంధ్రప్రదేశ్‌కు చెల్లించాలని అన్నారు.

పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించారని, గతంలో ఖర్చు చేసింది రాష్ట్ర ప్రభుత్వ వాటాగా భావించి మిగిలిన నిధులను కేంద్రం భరించాల్సుందని జేపీ అన్నారు. విభజన సమయంలో ప్రధాని పార్లమెంటులో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మిగతా రాష్ట్రాల్లాగా హక్కుగా వచ్చే నిధులతో పాటు.. విభజన నేపథ్యంలో అదనపు నిధుల్నీ ఇవ్వాలన్నారు.

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిపైనా పార్టీ రాజకీయం చేస్తున్నారని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. అధికార తెదేపా, బీజేపీల తీరును ఆక్షేపించారు. కోట్లాది మంది హిందువుల ఆరాధ్యదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల క్షేత్రం అత్యంత పవిత్రమైనదన్నారు. స్వప్రయోజనాల కోసం కొందరు ఇలాంటి పనులకు దిగజారుతున్నారన్నారు. టీటీడీ ఉద్యోగులు రాజకీయాలు చేయటం ఎంతమాత్రం తగదని, దేవుడిపై నమ్మకం ఉండేవారే టీటీడీని రక్షించుకోవాలని అన్నారు. టీటీడీ నిధుల్ని ఎక్కువగా చిత్తూరు జిల్లాలో, ముఖ్యంగా తిరుపతిలో ఖర్చు పెట్టాలని, స్థానికులే దేవస్థానాన్ని కాపాడుకోవటంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. *

# ఏపీలో ఉపద్రవం రాలేదు, తెలంగాణలో అద్భుతాలూ జరగలేదు!



"రాష్ట్ర విభజన వల్ల ఉపద్రవమూ రాదు, అద్భుతాలూ జరగవు" అని తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో తొలి నుంచీ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెప్పిన మాటలు నూరుశాతం వాస్తవమని ఈవేళ రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయం, పాలన రుజువు చేస్తున్నాయి.

చాలామంది పూనకాల్లో ఊగిపోతూ అనుకున్నట్టు.. తెలంగాణలో అద్భుతాలు జరగలేదు, ఆంధ్రప్రదేశ్‌లో ఉపద్రవమూ రాలేదు.

రెండు రాష్ట్రాల్లో ఏర్పడిన తొలి ప్రభుత్వాలు ఈ జూన్‌లో నాలుగేళ్ల పూర్తి చేసుకుని ఐదో ఏడు లోకి, ఎన్నికల ఏడాదిలోకి అడుగుపెడుతున్నాయి.

ఈ నాలుగేళ్లలో తెలంగాణలో అద్భుతాలు జరిగే అవకాశమే లేదా? రాష్ట్ర విభజనను ఒక అవకాశంగా మలచుకుని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అద్భుతాల్ని సృష్టించటం సాధ్యం కాదా? అంటే.. కచ్చితంగా ఉందనే, సాధ్యమనే చెప్పాలి.

తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) ఏర్పడక ముందు నుంచీ జేపీ చెబుతున్నట్టు.. 'రాజకీయం, పాలన మారి ఉంటే.. తెలుగునేల రెండు రాష్ట్రాలైనా, రాజధానులు రెండైనా అద్భుతాల్ని సృష్టించి ఉండేవి'.

రాజకీయం, పాలన మారకుంటే.. రాష్ట్ర విభజన వల్ల ఉపద్రవం రాదుగానీ, అద్భుతాలు మాత్రం జరగవు. ఈ స్పష్టతను పెంచేందుకే 'తెలంగాణ ఏర్పాటు ఒక మార్గమా? లక్ష్యమా?' అనే ప్రశ్నను ఉద్యమం ఉధృతమైన 2009 నుంచి లోక్‌సత్తా లేవనెత్తింది, తరచూ అడుగుతూ వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు మాత్రం.. రాష్ట్ర విభజన తర్వాత అద్భుత మనదగ్గ పెద్ద విజయాలనే సాధించామని చెప్పుకుంటున్నారు.

కేంద్రం వెన్నుపోటు పొడవటం వల్ల ఏపీ కష్టాలు మేటవేశాయని, అయినా దేశంలోనే వేగంగా డబుల్ డిజిట్ వృద్ధిని సాధించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దామని చంద్రబాబు చెబుతుంటే.. తెలంగాణ పాలన దేశానికే ఆదర్శమని, తెలంగాణలో మిషన్‌ని విజయవతంగా పూర్తిచేశాం కాబట్టి ఈ నమూనాతో దేశంలో గుణాత్మక మార్పునకు జాతీయస్థాయి రాజకీయాల్లోకి వెళ్లాలని నిర్ణయించామని కేసీఆర్ చెబుతున్నారు. బీజేపీయేతర, కాంగ్రెసేతర పార్టీలతో, ప్రధానంగా ప్రాంతీయపార్టీలతో కూడిన ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేయటానికి తెలంగాణ ముఖ్యమంత్రి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

ముఖ్యమంత్రుల వాదనలకు భిన్నంగా.. రెండు రాష్ట్రాల్లోనూ అద్భుతాలేమీ జరగలేదని లోక్‌సత్తా వాదించటానికి కొన్ని హేతుబద్ధమైన, నిర్దుష్టమైన ప్రాతిపదికలున్నాయి.

రెండు స్థూల కేటగిరీలుగా ఈ ప్రాతిపదికల్ని విభజిద్దాం. 1) సంపదసృష్టి 2) ఆ సంపదసృష్టిలో అందరికీ అవకాశాలు.

**సంపదసృష్టినే తీసుకుంటే,** రెండు తెలుగు రాష్ట్రాలూ పెట్టుబడులను ఆహ్వానించేందుకు గట్టి ప్రయత్నం చేశాయి. తెలంగాణకు హైదరాబాద్ అడ్వాంటేజ్ ఉండటంతోపాటు పాలన కుదురుకోవటానికి పెద్దసమయం అవసరం లేకపోవడం, ముఖ్యమంత్రి కేసీఆర్ కుమారుడు కేటీఆర్‌కు సంబంధిత విషయాల్లో కొంత పట్టు ఉండటం వల్ల వేగంగానే ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా తనకున్న అపార అనుభవంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెట్టుబడుల సాధనకు పెద్ద ప్రయత్నమే చేశారు. అయితే, తనకెదురైన ప్రత్యేక పరిస్థితులను అర్థం చేసుకోవడంలో చంద్రబాబు విఫలమవడం వల్ల ఆశించిన స్థాయి ఫలితాలు రాలేదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, మారిన పరిస్థితులు, నూతన సవాళ్లకనుగుణంగా బాబు మారలేదు. ప్రత్యేక విమానాల్లో విదేశీ దుబారా ప్రయాణాలు, రాష్ట్రంలో స్టార్ హోటల్ సమావేశాలు, సదస్సులు జరిపినా.. వచ్చిన పెట్టుబడులు, పెరిగిన ఉపాధి పరిమితమే. ఏపీ ప్రభుత్వ తాజా నివేదిక ప్రకారం విదేశీ సంస్థలు రూ.1,00,141 కోట్లతో 55 పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇందులో 30 విదేశీ సంస్థలు రూ.24,901 కోట్ల పెట్టుబడులు పెట్టి కార్యకలాపాలు ప్రారంభించాయి. వీటిలో 33,904 మందికి మాత్రమే ఉపాధి లభిస్తోంది. తెలంగాణలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ.. ఉపాధి కల్పన

అవసరానికి తగ్గ స్థాయిలో పెట్టుబడుల సమీకరణలో రెండు రాష్ట్రాలూ ఆశించిన ఫలితాల్ని సాధించలేకపోయాయి.

మిషన్ కాకతీయ, సాగు సదుపాయాల్ని విస్తరించటం, మద్దతు ధరకు కొనుగోళ్లు, గొర్రెల పెంపకానికి ప్రోత్సాహం వంటి సానుకూల చర్యల వల్ల తెలంగాణలో వ్యవసాయం, గ్రామీణార్థిక వ్యవస్థ బలపడింది. ఆంధ్రప్రదేశ్‌లో సంప్రదాయ వ్యవసాయం పెద్దగా లాభసాటి కాకపోయినా, చేపలు, రొయ్యల ఉత్పత్తి, ఎగుమతులతో వ్యవసాయం రికార్డుస్థాయిలో రెండంకెల వృద్ధిని నమోదు చేసింది.

**చంద్రబాబు తొలి ప్రాధాన్యాంశంగా అమరావతి** మీద దృష్టి పెట్టారు. గత అవినీతితో సంబంధం లేకుండా తాజాగా రాజకీయం చేసే గొప్ప అవకాశం వచ్చిందనుకోకుండా, రాష్ట్రాభివృద్ధి చుట్టూ పార్టీ రాజకీయాన్ని తిప్పకుండా, ప్రభుత్వానికి–పార్టీకి మధ్య తేడా లేకుండా చేసి రెంటినీ రియల్ ఎస్టేట్ ఆదాయం చుట్టూ తిప్పారు. తన కుమారుడి రాజకీయ భవిష్యత్తును తెలుగుదేశం భవిష్యత్తుగా, తెదేపా భవిష్యత్తును రాష్ట్ర భవిష్యత్తుగా చూపుతూ 'అంతా నేనే' అన్నట్టు పాలనను తయారుచేశారు. ఈ కేంద్రీకృత పాలన, పార్టీ రాజకీయం భ్రమల్లో తేలియాడటం వల్ల ఆయన.. ఏపీ ప్రజల్లో స్వతహాగా ఉండే ఎంటర్‌ప్రెన్యూర్ శక్తిని వెలికితీసే పనిచేయలేకపోయారు. చివరికి.. రాష్ట్ర విభజన సమయంలో మిగిలిన ఏపీకి పార్లమెంటు సాక్షిగా ప్రధానమంత్రి ఇచ్చిన 'ప్రత్యేకహోదా' హామీ అమలుకాలేదు.

చంద్రబాబు ఏనాడూ ప్రత్యేకహోదా కోసం కేంద్రాన్ని నిర్దిష్టంగా అడిగిన దాఖలాలు లేవు. రాష్ట్రం విడిపోతే, పరిశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోతుంది కాబట్టి ప్రత్యేకహోదా కావాలని తొలుత ప్రతిపాదించినప్పుడు.. అందులో భాగంగా 'పారిశ్రామిక పన్ను రాయితీల' గురించి జేపీ ప్రత్యేకించి వివరించారు. కానీ రాష్ట్ర విభజన జరిగాక.. 'పన్ను రాయితీలు హోదాలో భాగమని ఎవరు చెప్పారు? అలాంటిదేమీ లేదు' అని మీడియా సమావేశాలు పెట్టిమరీ చంద్రబాబు వాదించారు. హోదాలో పన్నురాయితీలు భాగం కాకపోతే.. ఏపీకి ప్రత్యేకహోదా పారిశ్రామిక పన్ను రాయితీలు ఇస్తే తమకు నష్టమంటూ అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఎందుకు కేంద్రానికి లేఖలు రాశారన్న చిన్నపాటి ఆలోచన కూడా ఏపీ ముఖ్యమంత్రికి తట్టలేదు. హోదా కోసం ఆందోళనలు చేస్తే జైళ్లలో పెట్టిస్తానని హెచ్చరించారు. లోక్‌సత్తా పదేపదే చెప్పాక.. చివరికి అమరావతికి పన్ను రాయితీల్ని అడిగారు. ఆ తర్వాత హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీని అంగీకరించారు. 2017 రిపబ్లిక్ డే వేదిక మీద మాట్లాడుతూ.. కేంద్రం నుంచి ఏపీ సాధించుకున్నన్ని ప్రయోజనాల్ని దేశంలో ఏ రాష్ట్రం సాధించిందో చెప్పాలని సవాలు చేశారు. కేంద్రాన్ని అభినందిస్తూ అసెంబ్లీలో తీర్మానం కూడా చేశారు. కానీ తర్వాత



కేంద్రంలోని బీజేపీ నాయకత్వం రాజకీయ గడుసుదనాన్ని ప్రదర్శించి వైకాపాను దువ్వుతూ, ప్రత్యేకహోదాను ఓ అస్త్రంగా వినియోగించుకోవటానికి లైసెన్సు ఇవ్వటంతో.. చంద్రబాబు తమ వాదన మార్చుకున్నారు.

ప్యాకేజీకి ప్రజల్ని తానే ఒప్పించటం, ప్యాకేజీ రూపంలో పైసా రాకపోవటం.. మరోపక్క ప్రత్యేకహోదా పేరుతో సెంటిమెంట్‌ను రగిల్చేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న ముమ్మర కార్యాచరణకు ప్రజల్లో స్పందన రావటంతో– బీజేపీ మీద చంద్రబాబు ఎదురుదాడికి దిగారు. రాష్ట్రానికి అందాల్సిన వనరులు, రాయితీలు అందకపోవటంతో.. ప్రత్యేక హోదాను ఎన్నికల అస్త్రంగా చేసేందుకు చంద్రబాబు రాజకీయ కార్యాచరణ మొదలుపెట్టారు. జాతీయ రాజకీయాల్లో చురుకైన పాత్రకు కూడా సిద్ధమవుతున్నారు. కేసీఆర్ తరహాలో వంశపారంపర్య రాజకీయాలను కూడా దృష్టిలో పెట్టుకుని ఈ స్కెచ్‌ని తయారుచేశారు.

హోదాపై ప్రధాన దోషి బీజేపీ అనటంలో సందేహం లేదు. ఢిల్లీలో (భౌగోళిక) భూకంప ప్రమాదావకాశాల్ని సమీక్షించటంపై చూపిన శ్రద్ధలో సగం కూడా తెలుగు రాష్ట్రాల విభజన హామీలఅమలుకు సంబంధించి మోదీ చూపలేదు. హోదాపై జరిగిన దగాలో బీజేపీతోపాటు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో సరయిన రీతిలో స్పందించకపోవటం కూడా కొంత కారణం. ప్రత్యేకహోదా ద్వారా పన్ను రాయితీల్ని సాధించుకుని ఎక్కడికక్కడ పరిశ్రమల్ని స్థాపించటం, నిర్ణీత కాలవ్యవధిలో రాయితీలని పొందటం మీదే గనక చంద్రబాబు తొలినుంచీ దృష్టి పెట్టి ఉంటే.. ఏపీకి బలమైన ఆర్థిక పునాది ఈ పాటికే ఏర్పాటై ఉండేది. ప్రధాన ప్రతిపక్షం వైకాపా అసెంబ్లీలో సకాలంలో సరైన ప్రశ్నల్ని లేవనెత్తకపోవటం, ఆ తర్వాత గంపగుత్తగా బహిష్కరించటం, రాష్ట్ర భవిష్యత్తు కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం కావటం సమస్యని మరింత జటిలం చేశాయి.

**తెలంగాణలో ఆర్థికంగా పెద్ద ప్రయత్నాలు చేస్తున్నా..** విజన్‌లో

## అవినీతిలో మాత్రం అత్యుత్తమ ర్యాంకులు

2017లో అవినీతి ఎక్కువగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ రెండో స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ నాలుగవ స్థానంలో ఉందని ఇటీవల విడుదల చేసిన ఓ అధ్యయనం తెలిపింది. ప్రజాభిప్రాయాల ఆధారంగా అవినీతి ఎక్కువగా ఉన్న రాష్ట్రాల జాబితాను ఈ సర్వే ప్రకటించింది. ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారీ పనుల కోసం లంచాలబారిన పడ్డామని తెలంగాణలో 73 శాతం కుటుంబాలు తెలిపాయి. అవినీతి రాష్ట్రాల్లో తెలంగాణకు 3.89 పాయింట్లు రాగా, ఏపీకి 2.69 పాయింట్లు వచ్చాయి.

తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 13 రాష్ట్రాలను చూస్తే.. ముందుతో పోలిస్తే అవినీతి స్థాయిలో 'మార్పు లేదు లేదా పెరిగింది' అని 75 శాతం కుటుంబాలు అభిప్రాయపడ్డాయి.

సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్) సంస్థ 'భారత్ అవినీతి అధ్యయనం' పేరుతో ఈ సర్వేను చేపట్టింది. ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్), విద్యుత్, వైద్యం, పాఠశాల విద్య, నీటి సరఫరా, బ్యాంకు సేవలు, పోలీసు శాఖ, ఉపాధి హామీ వంటి 11 అంశాలపై ప్రజల అభిప్రాయాలను ఇందులో తీసుకున్నారు. పోలీసు శాఖలో, రవాణాలో, ఇళ్లు-భూ రికార్డుల్లో, వైద్యరంగంలో, న్యాయవ్యవస్థలో అవినీతి పెరిగినట్టు పలు కుటుంబాలవారు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించుకునేందుకు లంచాలిచ్చినట్టు ఢిల్లీలో కూడా 29 శాతం కుటుంబాలు చెప్పాయి.

అవినీతిలో తొలిస్థానంలో తమిళనాడు (4.08 పాయింట్లు), మూడో స్థానంలో పంజాబ్ (3.08), ఐదో స్థానంలో గుజరాత్ (2.67) ఉన్నాయి.

తెలంగాణలో అవినీతిపై స్పందించటంలో పౌరులు కొంత క్రియాశీలంగా ఉన్నారని, ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ క్రియాశీలతే ఎక్కువగా కనిపిస్తోందని సీఎంఎస్ వ్యాఖ్యానించింది.

హేతుబద్ధత, వాస్తవాలకు ప్రాధాన్యత తక్కువగా ఉండటం, ప్రజాస్వామిక చర్చ కొరవడటం ఫలితాలను పరిమితం చేస్తున్నాయి.

సాగునీటికి ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. కానీ ఆత్మవిశ్వాసంతో సానుకూల స్పందనకన్నా.. ఆత్మన్యూనతతో ప్రతికూలంగా స్పందించి ఆలోచించే ధోరణి ఎక్కువైతే, ఒక పరిధి దాటి ఆలోచనలు విస్తరించలేవు. ఎవరికో గట్టి సమాధానం చెప్పటం కోసం మనం ఏవో ప్రాజెక్టులు చేయాలి, ఇబ్బడిముబ్బడిగా సాగునీరు అందించాలి అనుకుంటే.. రాష్ట్ర వాస్తవ సామర్థ్యం వికసించకపోవచ్చు (ఏపీలో మరో రకమైన ఆత్మన్యూనతను చంద్రబాబు పెంచి పోషిస్తున్నారు. రాష్ట్రం విడిపోయిన జూన్ 2న 'నవ నిర్మాణ దీక్ష' పేరుతో ప్రభుత్వోద్యోగులను ప్రచ్ఛన్న పార్టీ కార్యకర్తలుగా ఉపయోగించుకుంటూ.. ప్రజల రోజువారీ సేవలకు రోజుల తరబడి గండికొడుతున్నారు).

నిరుద్యోగం ప్రపంచవ్యాప్తంగానే పెద్దసమస్యగా కొనసాగుతున్న సమయంలో.. ఎక్కువమంది వ్యవసాయం, గ్రామీణ జీవనం మీద ఆధారపడిన తెలంగాణలో నిరుద్యోగాన్ని ఎదుర్కోవాలంటే, వ్యవసాయాన్ని ప్రోత్సహించటం కేసీఆర్ తీసుకున్న సరైన నిర్ణయమే. కానీ భారీ వ్యయంతో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించి వ్యవసాయం చేయాలన్న ఆలోచనపై తగినంత చర్చ కొరవడింది. తన సొంత డబ్బుతో నిర్మించే ప్రాజెక్టే అయితే కేసీఆర్ ఇలాగే పెట్టుబడులు పెడతారా? తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులకు ఇప్పుడు ఖర్చుచేస్తున్న మొత్తంలో ఎనిమిదో వంతుతోనే రాష్ట్రంలోని చాలా ప్రాంతాలకు నీరివ్వొచ్చని ఎంతో అనుభవం, విశ్వసనీయత గల నిపుణులు మీడియా ద్వారానే తెలియచేశారు. వారు పొరపాటు పడివుంటే.. అదెలాగో రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ వివరించి ఉండాల్సింది.

సాగుకు నీరందించటానికి మరీ ఎక్కువ వ్యయమయ్యే చోట చిన్న ఎత్తిపోతల నీటి పథకాలను రూపొందించటం, అది కూడా సాధ్యం కాని చోట్ల.. చుట్టూ ఉన్న కొన్ని గ్రామాలకు హబ్‌గా చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి వ్యవసాయాధారిత పరిశ్రమను ప్రోత్సహించటం వంటివి చేస్తే- వ్యవసాయంలోనూ ఆదాయం పెరుగుతుంది, ఆర్థికంగా కూడా మున్ముందు నష్టాలు రాకుండా ఉంటాయి.

ఒకే మూసలో భారీ ఎత్తిపోతల సాగునీటి పథకాలను చేపట్టటం వల్ల.. మూలపెట్టుబడితోపాటు వేలాది మెగావాట్ల విద్యుత్తు అవసరమవుతుంది, ప్రతి ఏడాది నీటిని సరఫరా చేయటం కోసం వేల కోట్ల మేరకు ఖజానాకి గండిపడుతుంది. ఖర్చు అధికం-లాభం స్వల్పం! ఖర్చు పెద్దఎత్తున పెరగటంతోపాటు, పండించిన పంటకు న్యాయమైన ధరను ఇవ్వటం నిరంతర సమస్యగానే కొనసాగుతుంటుంది. రైతుబంధు పెట్టుబడి రాయితీ పథకం సూత్రప్రాయంగా ఆహ్వానించదగ్గదే. కనీస అవసరమైన ఆహారాన్ని అందించే వ్యవసాయాన్ని గాలికొదిలేస్తే మిగతా సమాజంలో చాలామందిని ధరల భారం కుంగదీసే అవకాశం ఉంటుంది. అందుకే వీలైనన్ని పద్ధతుల్లో సమాజం మీద భారం లేకుండా రైతుకు తోడ్పాటునందించే పని కొనసాగుతుండాలి. వ్యవసాయం మీద అత్యధికులు ఆధారపడి ఉండే భారత్‌లో.. మరి ముఖ్యంగా ఈ రకంగా తేలికైన బహుముఖ సబ్సిడీలు రైతులకు అవసరం. కానీ ఆ సాయం

అధికారపార్టీలు, రాజకీయ నేతలు ప్రచారం చేసుకోవటానికి ఎక్కువగా, రైతులకు తక్కువగా ఉపయోగపడితేనే సమస్య. వ్యవసాయ సంక్షోభానికి నిజమయిన పరిష్కారం రైతులకి మంచిధరలు వచ్చే విధానాలని రూపొందించి, ఆదాయాన్ని పెంచటం. విదేశీ వాణిజ్యం, శీతల గిడ్డంగులు, ప్లెడ్జి రుణాలు, రిటెయిల్ చైన్లు, ప్రోసెసింగ్ పరిశ్రమలు– ఇలా సమగ్రంగా, సమర్థంగా అన్ని రంగాలలో ప్రభుత్వం పనిచేస్తేనే వ్యవసాయం గట్టెక్కుతుంది.

అసంబద్ధ సాగునీటి ప్రాజెక్టుల జోలికిపోకుండా, సాగుకు అవకాశం లేని చోట వ్యవసాయధారిత పరిశ్రమలకు ప్రాధాన్యతనిస్తూ చిన్న పట్టణాల అభివృద్ధిని చేపట్టి ఉంటే.. తెలంగాణలో వ్యవసాయం, పరిశ్రమలు పరస్పరాధారితంగా వృద్ధి చెందుతూ ఆర్థికంగా ఇంకా ఎక్కువ లాభం జరిగి ఉండేది. విదేశీ పెట్టుబడిదారులకు కాకుండా.. స్వదేశీ సామాన్య యువ ఎంటర్‌ప్రెన్యూర్‌లకు ఎక్కువ అవకాశాలు అందుబాటులోకి వచ్చేవి.

ఎంతో అవసరమైన భూ రికార్డుల పరిశీలన, ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని కూడా కేసీఆర్ ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లా హడావుడిగా నిర్వహించటం వల్ల క్షేత్రస్థాయిలో లక్షల సంఖ్యలో ఫిర్యాదులు అధికారులను, రైతులు, భూయజమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

**ఇక సంపద పంపిణీలో అందరికీ అవకాశాలను అందించటం విషయాని కొస్తే.. ప్రధానంగా ప్రభుత్వ పాత్ర ఉండాల్సింది ఇక్కడే!**

నిజానికి ప్రభుత్వం ఆధునిక ప్రజాస్వామ్యంలో తాను చేయాల్సిన ఈ దిగువ బాధ్యతల్ని నెరవేరేస్తుంటే, పెట్టుబడులు వాటంతటవే పెరుగుతాయి, ఆర్థికవ్యవస్థ పుంజుకుంటుంది. అంటే.. సంపదసృష్టికి–సంపదపంపిణీలో అందరికీ అవకాశాలను అందించటానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. ప్రభుత్వాల పనితీరుని తేలిగ్గా అర్థం చేసుకోవటానికే తప్ప.. ఒక పరిధి దాటి ఈ రెంటినీ వేర్వేరుగా చూడలేం. మరి ప్రభుత్వం చేయాల్సిన పనులేమిటి?.. చట్టబద్ధపాలన–నాణ్యమైన పౌరసేవలు, ప్రపంచంలో ఎక్కడైనా తలెత్తుకుని బతకగలిగేలా, ఉపాధిని పొందగలిగేలా చేసే మంచి విద్య, ఆరోగ్యం అందరికీ, ఉమ్మడి అవసరాలను తీర్చే మౌలికవసతులు, స్థానిక స్వయంపాలన ప్రధానమైనవి. ఉదాహరణకి రైతు సంక్షోభాన్నే తీసుకుంటే, విద్య, ఆరోగ్య రంగాలలో ప్రభుత్వం మీద నమ్మకం పూర్తిగా సడలిపోవటంతో, పేద గ్రామీణ కుటుంబాలు సైతం ఏటా అదనంగా రూ.60,000 నుండి రూ.80,000 దాకా ఖర్చు చేయాల్సి వస్తోంది. అందువల్ల గ్రామీణ సంక్షోభం మరింత ముదురుతోంది.

వీటిని ప్రభుత్వం సరిగా అమలు చేస్తే చాలు.. సుపరిపాలనకు కావలసిన వాతావరణం ఏర్పడుతుంది. ఈ కొలమానాల్లో వేటిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సక్రమంగా అమలు చేశాయో చూద్దాం.

**చట్టబద్ధపాలనలో తెలుగు రాష్ట్రాలకు నూటికి 20 మార్కులు కూడా పడవు.**

తెలంగాణలో నయీం కేసు, ఎన్‌కౌంటర్లు, దళితులపై దాడులు, భూకబ్జాలు, ఓటుకు కోట్లు కేసు, అటవీ జంతువుల వేట, ఇసుక దోపిడీదారుల అకృత్యాలు వంటి లెక్కకు మిక్కిలిగా ఉన్న నేరాల్లో ప్రభుత్వం రాచరికంలోలా వ్యవహరించింది. తమకు నచ్చినవారికి చట్టాన్ని చుట్టం చేసి, నా సొంత ఏసీబీ, నా సొంత పోలీసు అనే రీతిలో ముఖ్యమంత్రి వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే తీరుగా రాజును మించిన రాజభక్తిని పోలీసులు ప్రదర్శిస్తుంటే, కాల్‌మనీ సహా పలువురు ఎమ్మెల్యేలు, నేతల కేసులు, కబ్జాల దౌర్జన్యాలు అటకెక్కాయి. ఇటీవల గుంటూరు జిల్లా దాచేపల్లిలో బాలికపై అత్యాచారం జరిగిన ఘటనను కూడా ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లా ప్రచారానికి ఉపయోగించుకున్నారు తప్ప.. చట్టబద్ధపాలనను మెరుగు పరిచేందుకు నిర్దిష్ట చర్యల మీద ముఖ్యమంత్రి దృష్టి పెట్టలేదు.

అవినీతి కట్టడిని, అందుబాటులో న్యాయాన్ని కూడా చట్టబద్ధపాలనలో భాగంగానే పరిగణిస్తే.. రెండు రాష్ట్రాల్లోని అధికార పార్టీలు రెండూ వచ్చే ఎన్నికలకు వేల కోట్ల రూపాయలను చట్టవిరుద్ధంగా పోగేసుకోవటాన్ని ప్రస్తావించాలి. ధృవీకరించలేకపోవచ్చుగానీ, ఇంగితజ్ఞానానికి కూడా అర్థమయ్యే విశ్వసనీయ వార్తలివి. వేలు, లక్షల మందితో బహిరంగసభ ఏర్పాటు చేయాలంటే వెదజల్లే డబ్బంతా ఆ పార్టీలకు చట్టబద్ధంగా వచ్చిందా? అవినీతిపై కాల్ సెంటర్లకు వచ్చిన ఆరోపణల్లో కొన్ని ఫేక్, అసంబద్ధమైనవి ఉండొచ్చుగానీ, చాలావరకూ ప్రజల రోజువారీ జీవితంలోని లంచాల బెడద నుంచే అవి వస్తున్నాయి. ప్రజాప్రతినిధులతో లాలూచీ పడి ప్రభుత్వాధికారులు ఎంత పెద్దఎత్తున లంచాలు తీసుకుంటున్నారో తరచూ బైటపడుతున్న కేసుల్లో పట్టుబడుతున్న నగదు, నగలే తెలియజేస్తున్నాయి.

రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ అవినీతి అధికారులపై దాడులు చేయటానికి ఏసీబీకి కొంత స్వేచ్ఛనిచ్చి, పట్టుబడిన కేసులను చూపుతూ అవినీతి వ్యతిరేక పోరాటమంటూ ప్రచారం చేసుకుంటున్నారుగానీ.. వాస్తవానికి చాలామంది అధికారులపై విచారణ చేయకుండా ఫైళ్లను తొక్కిపడుతున్నారు. చట్టం అమలులో, అవినీతిలో చిన్నవాళ్ల మీద చర్యలుంటున్నాయిగానీ.. పైస్థాయి వారి మీద, ప్రభుత్వోద్యోగుల మీదా చర్యలు చాలా అరుదుగా ఉంటున్నాయి.

పారిశ్రామికవేత్తలకు నెలలోపు, మూడు వారాల్లోనే అన్ని అనుమతులూ ఇస్తున్నామని చెప్పుకుంటున్న రెండు రాష్ట్రాల ప్రభుత్వాలూ.. కోట్లాది సామాన్య ప్రజలకు మాత్రం సరైన ప్రభుత్వ సేవల్ని సకాలంలో అందించలేకపోతున్నాయి (అవినీతిలో తెలంగాణ 2వ స్థానంలో, ఏపీ 4వ స్థానంలో ఉన్నాయని ఇటీవల

కూడా సీఎంఎస్ సర్వే ధృవీకరించింది). ఇందుకోసం 'పౌర సేవల' నమూనా చట్టాన్ని లోక్‌సత్తాయే తయారుచేసి ఇద్దరు ముఖ్యమంత్రులకూ పంపినా, చట్టం తెచ్చే ధైర్యాన్ని మాత్రం చేయలేకపోతున్నారు. పబ్లిక్ సర్వెంట్లుగా నిర్వచించబడే ఉద్యోగుల చేత ప్రజలకు సేవ చేయించటం చేతగాకపోగా.. వారికి జీతాల్ని మాత్రం ఠంచనుగా పెంచేస్తున్నారు. అది కూడా దేశంలోనే రికార్డుస్థాయిలో. ప్రభుత్వోద్యోగులకు-90 శాతం ప్రజలకు మధ్య జీవన ప్రమాణాల్లో పెద్దఎత్తున అంతరం ఉన్న దేశంలో కనీస సేవలు కూడా అందించలేని పాలనా దౌర్భాగ్యం కొనసాగుతోంది (ఆర్టీసీ విషయంలో ఆ తప్పిదం కేసీఆర్ ప్రభుత్వానికి కొంత తెలిసొచ్చింది). ప్రభుత్వోద్యోగుల చేత ఉద్యమాలు చేయించి తెలంగాణలో చేసిన తప్పునే ఇప్పుడు చంద్రబాబు ఏపీలో చేస్తున్నారు.

ఈ రకంగా.. చట్టం అందరికీ సమానంగా అమలవుతుందని, అవినీతి లేకుండా నాణ్యమైన సేవలు అందుతాయని, ప్రజలను ద్వితీయశ్రేణి పౌరులుగా కాకుండా ప్రభువుల్లా ప్రభుత్వ కార్యాలయాల్లో గౌరవిస్తారని భరోసా ఇవ్వటంలో రెండు ప్రభుత్వాలూ విఫలమయ్యాయి. కుటుంబ వ్యవస్థ, సమాజంలో ఉన్న మంచి వల్ల ఎక్కువ భద్రత లభిస్తోంది తప్ప.. చట్టం సక్రమంగా అమలవటం వల్ల కాదు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా అవ్వాల్సిన పనులు సక్రమంగా జరగక.. మనలో చాలామంది ఎంతో విలువైన ఓటును ఆ పనుల కోసం అమ్ముకుంటున్నారనీ మనకు తెలుసు. ఈ ప్రాథమిక పునాదుల్ని బాగు చేయలేనప్పుడు.. గొప్ప పాలనకు ఆస్కారమెక్కడిది?

మహిళలపై, బాలికలపై వేధింపులు, అత్యాచారాలు పెరుగుతున్నా.. దోషులకు శిక్షలు మాత్రం అరుదుగానే పడుతున్నాయి. వేధింపుల ఆరోపణలకు సంబంధించి కేసులు బాగానే బుక్ చేయగలుగుతున్నాంగానీ, దోషులకు శిక్ష పడేలా చేయలేకపోతున్నామని 'షీ టీమ్స్' మొత్తుకుంటున్నా.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక కోర్టులను ఏర్పాటు చేసే ప్రయత్నం చేయటం లేదు. షీ టీమ్స్‌ని బమ్మ తుపాకీలా చూపించి మహిళల భద్రతకు భరోసా అంటూ ప్రచారం చేసుకోవటానికే పరిమితమవుతోంది. ఏపీలో కూడా ఒక్క స్థానిక కోర్టునూ ఏర్పాటు చేయలేదు. మహిళలపై వేధింపుల దశలోనే కేసులను వెంటనే తేల్చేసి, దోషులకు చిన్న శిక్షలు వేసి బాధితులకు న్యాయం చేయటం వల్ల అత్యాచారాల దాకా తెగించే ధోరణులు తగ్గుతాయని, ఇందుకోసం లోక్‌సత్తా చేసిన ప్రయత్నం వల్ల 2009లో వచ్చిన గ్రామన్యాయాలయాల చట్టాన్ని వినియోగించుకోవాలని పలుమార్లు జేపీ చెప్పినా, ముఖ్యమంత్రుల్లో సోయి లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో, బైటా చెప్పటంతోపాటు స్థానిక కోర్టులపై రెండు సార్లు ముఖ్యమంత్రులకు జేపీ లేఖలు కూడా రాశారు.

ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు చేసే ఆందోళనలను పక్కదోవ పట్టించే తంత్రంలో ఏపీ ప్రభుత్వం ఆరితేరితే, కేసీఆర్ ప్రభుత్వం ఏకంగా అణగదొక్కేస్తోంది. విపక్షాల ఎజెండా సరైనదా కాదా అన్నది తేల్చాల్సించి ప్రజలు తప్ప పాలకులు కాదు. వాళ్ల వెనక ఏమైనా చట్టవిరుద్ధ కుట్రలుంటే అవేంటో ప్రజల ముందుంచాలి తప్ప.. చట్టబద్ధంగా ఆందోళనలు, విమర్శలు చేయటమనే ప్రజాస్వామిక హక్కును తోసిపుచ్చే అధికారం పాలకులకు లేదు.

ఇక **తర్వాతి విషయం విద్య, ఉపాధి రంగాలకి సంబంధించినది.** ప్రభుత్వ, ప్రయివేటు, అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి..ఏ సర్వేనైనా తీసుకోండి, విద్యారంగానికి కీలకమైన విద్యాప్రమాణాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో అధ్వాన్నంగా ఉన్నాయనే చెబుతున్నాయి (వీటికి సంబంధించి తాజా వివరాల్ని గత సంచికలో చూడొచ్చు). తెలంగాణలో, ఏపీలో కూడా కొన్ని గురుకుల, కస్తూర్బా పాఠశాలల్లో వసతి, పుస్తకాలు, బట్టలు అన్నీ కలిపి కూడా రూ.50,000లోపు మంచి చదువును అందిస్తుంటే.. ప్రభుత్వ పాఠశాలల్లో ఏడాదికి రూ.70,000 ఖర్చు చేస్తున్నా ఎందుకు మంచి చదువు రావటం లేదు అని ముఖ్యమంత్రులు తర్కించిన పాపాన పోలేదు. స్కూలు గోడలకు పెయింట్‌లు వేస్తే చదువు బాగుపడినట్టేనన్న భ్రమను కలిగించి దాటవేస్తున్నారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్య సరిగా లేకపోవటం వల్లే నైపుణ్యాలు కొరవడి.. ఉపాధి అవకాశాలను అందుకోలేకపోతున్నారు. ఈ వైఫల్యాన్ని సరిదిద్దేందుకు తక్షణ, దీర్ఘకాలిక ప్రణాళికల్ని అమలు చేయటానికి బదులు రిజర్వేషన్లు, కులాల కార్పొరేషన్ల రాజకీయం చేస్తున్నారు. ఏపీ ప్రభుత్వం యువతను అవమానించేలా 'నిరుద్యోగ భృతి'ని మొదలుపెట్టింది. ప్రభుత్వోద్యోగాల ఊరింపులు పూర్తయితే.. తెలంగాణలోనూ ఉపాధి ప్రకంపనలు తీవ్రతరమవుతాయి. మరోపక్క, పేద, మధ్యతరగతి ప్రజలకొచ్చే ఆదాయాన్ని గుంజుకోవటానికి మద్యాన్ని రెండు రాష్ట్రాలూ ఆదాయమార్గం చేసుకున్నాయి.

**వైద్య ఆరోగ్య రంగానికి సంబంధించి కూడా తెలుగు రాష్ట్రాల్లో విషాదకర పరిస్థితి కొనసాగుతోంది.** ప్రాణాల్ని బాగుచేసే చదువుల కోసం ఏళ్ల తరబడి కష్టపడిన వైద్యులకు తగిన జీతాల్ని కూడా ఇవ్వకుండా ప్రభుత్వాస్పత్రుల్ని నడుపుతున్నారు. రోగం వస్తే జిల్లా ఆస్పత్రిదాకా వచ్చి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితుల్ని కల్పించారు. ప్రాథమిక ఆస్పత్రుల్ని బాగు చేయకుండా, వైద్యులకు జీతాలివ్వకుండా ఆరోగ్య రంగాన్ని నాశనం చేస్తూ.. జబ్బు ముదిరాక ఆపరేషన్ వంటి తృతీయ దశ వైద్య సేవల్ని అందించటానికి ఆరోగ్యశ్రీని మాత్రం వివిధ రూపాల్లో అమలు చేస్తున్నారు. దీనివల్ల ఖజానా ఖాళీ అవుతోంది, కాస్త నోరున్నవాళ్లకు, సర్కారీ ఉద్యోగులకు కొన్ని సదుపాయాలు అందుతున్నాయి, ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు బాగుపడుతున్నాయి తప్ప.. ప్రజలకు మాత్రం వైద్యం అందటం లేదు. వైద్యానికి జేబుల్లో నుంచి అత్యధికంగా ఖర్చు చేస్తూ

## చదువుకు-ఉపాధికి సంబంధం లేకుండా ఉంది

తెలంగాణలో ప్రతి 1000 మందిలో 869 మంది గ్రాడ్యుయేట్లు, 917 మంది పోస్టు గ్రాడ్యుయేట్లకు చదువుకు, మార్కెట్ నైపుణ్యాలకు మధ్య అంతరం వల్ల ఉద్యోగాలు రావటం లేదని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ 2017 వార్షిక సర్వేలో తేలింది. 2015 ఏప్రిల్- డిసెంబర్ మధ్య ఈ ఉద్యోగ-నిరుద్యోగ గణాంకాల సర్వేను నిర్వహించింది. 4,423 ఇళ్లను, పదిహేనేళ్లు పైబడిన 19,700మందిని ఇందులో భాగంగా ప్రశ్నించారు. అత్యధికులు చదువుతున్న విద్యావ్యవస్థకు, అవసరమైన ఉద్యోగ నైపుణ్యాలకు సంబంధం లేకుండా ఉందని పేర్కొంది. ఇందులో 770 ఇళ్లలో నెలవారీ జీతం సంపాదించేవారే లేరు. యువత విద్యావంతుల్లో ఎక్కువగా ఉన్న ఇంజినీర్లకు ఉద్యోగాలు లభించక తమకు సంబంధంలేని ఇతర రంగాల్లో ఉపాధి పొందుతున్న సంగతి తెలిసిందే. రోడ్లు తవ్వటం, గుంతలు పూడ్చటం, చెరువులు బాగుచేయటం వంటి పనుల్లో ఉపాధి పొందుతున్నవారి సంఖ్య తెలంగాణలో 43.4శాతంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ తర్వాతి స్థానమిది. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న వరద సహాయకచర్యలు వంటి వాటిల్లో, ఉపాధి హామీ వంటి పథకాల్లో వీరు రోజువారీ ఆదాయం పొందుతున్నారు. తెలంగాణలో ప్రతి 1000మందిలో 887 మంది లిఖితపూర్వక కాంట్రాక్టు లేకుండానే పనిచేస్తున్నారు. వెయ్యిమందిలో 104మందికే ఆరోగ్య రాయితీలు, పీఎఫ్ పెన్షన్ ప్రయోజనాలు దక్కుతున్నాయి. ప్రతి వెయ్యి కుటుంబాలలో 249 మందికి రూ.5,001 నుంచి రూ.7,500 జీతం వస్తుండగా, 104 మందికి రూ.20,001 నుంచి రూ.50,000 వరకు ఆదాయం లభిస్తోంది.

పేదలుగా మారుతున్నవారిలో తెలుగు రాష్ట్రాల ప్రజలే ముందున్నారు. అదేమంటే, కిట్లు, దుప్పట్లు గురించి ఏకరువు పెడుతున్నారు. ప్రాథమిక స్థాయి నుంచి వైద్యాన్ని బాగు చేసి పౌష్టికాహారాన్ని అందుబాటులోకి తెచ్చే రోడ్‌మ్యాపే ఇరు రాష్ట్రాల పాలకుల్లో కరవైంది. విచ్చలవిడి మద్యం, వైద్యసేవలను అందుబాటులోకి తేవటంలో వైఫల్యం.. తెలంగాణ, ఏపీల్లో పేదరికానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి.

**ఉమ్మడి అవసరాలను తీర్చే మౌలిక వసతులనే తీసుకుంటే,** హైదరాబాద్‌లో రోడ్లపై సిటీ బస్సుల్లో ప్రయాణిస్తే.. ఓ ధనిక రాష్ట్రంలో బస్సులో ప్రయాణం ఇంత ఘోరంగా ఉంటుందా అనుకోని రోజు ఉండదు. రోడ్ల గోతుల్ని చూపిస్తే గుంతకు ఇంతని నగదు బహుమానమిస్తామన్న జీహెచ్ఎంసీ, అధికారులను సస్పెండ్ చేసేస్తానన్న ముఖ్యమంత్రి ఆ ఊసే ఎత్తడం లేదు. కేసీఆర్ తన క్యాంప్ ఆఫీస్ ఎదురుగా ఉన్న బస్‌స్టాప్‌లో 49 నెంబర్ బస్సు ఎక్కి ఒక్కసారి సికింద్రాబాద్ దాకా వెళ్లి వస్తే.. ఇక ఆరోజు ఆయన చాలా కార్యక్రమాలను వాయిదా వేసుకోవాల్సి ఉంటుందేమో! ఏపీలోనైతే, వ్యవసాయ అనుబంధ రంగంలో అత్యంత ఎక్కువ ఆదాయాన్నిచ్చే పశ్చిమ గోదావరి జిల్లాలో రోడ్ల మీద ప్రయాణించటానికి సురాజ్య యాత్ర బృందం తెగ అవస్థ పడాల్సి వచ్చింది. జనం పన్నుల రూపంలో కడుతున్న డబ్బంతా ఏమవుతోంది? కేవలం ఎయిర్‌పోర్టులకు, ఇవాంకా లాంటి అతిథుల కోసం మాత్రమే మౌలిక వసతుల్ని మెరుగుపరుస్తారా?

మరోవైపు, **అవినీతిని చట్టంతోనేకాకుండా రోజువారీ పాలనలో భాగంగా నియంత్రించటానికి, నిత్యావసర సేవల్ని వేధింపులు లేకుండా వేగంగా పొందదానికి, ప్రజలు పాలనలో** భాగస్వాములవుతూ పౌరసత్వాన్ని, నాయకత్వాన్ని **పెంపొందించుకోవటానికి, రైతులకు అండగా నిలవటానికి కీలకమైన.. స్థానిక ప్రభుత్వాల సాధికారతను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు.** కేంద్రం నుంచి పంచాయతీలకు నేరుగా వచ్చే నిధులను కూడా పక్కదోవ పట్టించింది. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా పంచాయతీలు, మునిసిపాలిటీలకు ఇచ్చే వాటాలు పల్లీల పాటి కూడా లేవు. దీనికితోడు, జన్మభూమి కమిటీలని ఏర్పాటు చేసి స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేసింది. తెలంగాణలోనూ అధికార కేంద్రీకరణ పెద్దఎత్తునే ఉన్నా.. గ్రామస్థాయికి అధికారాన్ని వికేంద్రీకరించాలన్న మాటలు వినపడుతున్నాయి, చిన్న ప్రయత్నాలైతే జరుగుతున్నాయి. కానీ స్థూలంగా రెండు రాష్ట్రాలూ అధికార వికేంద్రీకరణకు మాత్రం సుముఖంగా లేవు. రోజూ ప్రచారం తప్ప.. చంద్రబాబు, కేసీఆర్ ప్రభుత్వాలు అందిస్తున్న పాలనకు ప్రజల జీవితాలతో సంబంధం లేకుండా పోయింది.

చేపలు, రొయ్యల వ్యాపారం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా మారేస్థాయికి ఎదిగిందంటే.. అందుకు ప్రభుత్వాల జోక్యం లేకపోవటం కూడా ఒక కారణమే! డిమాండ్-ఆదాయం ఉంది కాబట్టి, సమస్యలు వచ్చినా రైతులు పరిష్కరించేసుకుంటూ ఎదుగుతున్నారు. ప్రభుత్వాలు అనుచిత జోక్యం చేసుకోకుండా, తాము చేయాల్సిన ఈ (పైన పేర్కొన్న) బాధ్యతల్ని సరిగా నెరవేరుస్తుంటే, ఉపాధి అవకాశాలు పెరగటంతో పాటు అందరికీ వాటిని అందుకునే సామర్థ్యం కూడా పెరుగుతుంది.

**మొత్తంగా చూస్తే, విభజన తర్వాత రెండు రాష్ట్రాలకూ కేంద్రం నుంచి వచ్చే నిధుల వాటా పెరిగింది. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలను సాధించుకోగలిగితే.. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి రంగాలను మెరుగుపరచుకునే అవకాశాలు పెరుగుతాయి, ఇష్టమొచ్చినట్టు పెత్తనం చెలాయిస్తున్న సివిల్ సర్వీస్ అధికారులను కొంత జవాబుదారీ చేయొచ్చు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలను, ఇతర శక్తులనూ కలుపుకుని ఇలా మూడో దశ ఫెడరలిజం కోసం ప్రయత్నిస్తూనే, పాలనను గరిష్ట ప్రజాప్రయోజనకరంగా మార్చుకునేందుకు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలూ ప్రయత్నించాలి.** ఇందుకోసం రాజకీయ సోమరితనాన్ని వదిలించుకుని లోతుగా ఆలోచించగలిగి ఉండాలి. ప్రజల్లో అమ్ముడయ్యే, వారిని ఆకర్షించే రీతిలో నిధుల్ని

వృధా చేయకుండా, అప్పుల్ని తగ్గించుకుని (ధనిక రాష్ట్రమని చెప్పుకునే తెలంగాణలో కూడా నిధుల కటకట వల్ల ఇప్పుడు పలు చెల్లింపులపై ఆంక్షలు విధించారు) ప్రజలకు అవసరమైన అంశాల కోసం 'పర్యావరణ హితం'గా నిధుల్ని ఖర్చు చేసి ఆకట్టుకునేలా ప్రచారం చేసుకోగల నైపుణ్యాన్ని ఇరువురు ముఖ్యమంత్రులూ పెంచుకోవాలి. రైతులు రుణమాఫీల్ని, తాయిలాల్ని కోరుకోవటం లేదని, తాము పండించిన పంటలకు మంచి ధర లభించాలని కోరుకుంటున్నారని తన పర్యటనల్లో తేలిందని స్వచ్ఛంద పదవీ విరమణ చేసి సామాజిక కార్యకర్తగా రాష్ట్రంలో పర్యటిస్తున్న సీబీఐ మాజీ జేడీ వి.వి లక్ష్మీనారాయణ కూడా చెబుతున్నారు. వ్యవసాయ సమస్యల మీద ఆయన ఎక్కువ కార్యక్రమాల్లో పాల్గన్నారు. మాఫీలు, తాయిలాల చుట్టూ పాలన వెనక డొల్లతనాన్ని లోక్‌సత్తా ఇప్పటికే పలుమార్లు ఎండగట్టింది.

'ఆలోచించటానికి చేయాల్సిన నిజమైన కష్టాన్ని తప్పించుకోవటానికి మనుషులు వెతకని చిట్కాలుండవు' అని థామస్ ఎడిసన్ అంటుండేవారు. సరైన రీతిలో ఆలోచించకుండా, తక్షణావసరాల్ని దీర్ఘకాలిక ప్రయోజనాలతో సంధానం చేయకుండా ఎప్పటికెయ్యది..అన్నట్టుగా వ్యవహరిస్తే మాత్రం- ఇద్దరు ముఖ్యమంత్రులూ ప్రజలకు చాలా చెరుపు చేసినవారవుతారు. తెలుగుదేశం పార్టీగానీ, ప్రభుత్వం గానీ, తెరాస పార్టీ గానీ, ప్రభుత్వంగానీ తక్షణావసరాల కోసం ఏం చేసినా.. ఊబి నుంచి బైటపడేలా మార్పు దిశగా కొంతయినా ప్రయత్నం చేయకపోతే క్రమంగా పార్టీపరంగా కూడా అంతరించిపోవటం ఖాయం.


పైపైనే అయినా మార్పు కోసం కేసీఆర్ కనీసం కొంత స్పేస్‌ని కేటాయించే ప్రయత్నం చేస్తున్నారుగానీ, చంద్రబాబు మాత్రం ఇంకా ఇంకా కూరుకుపోయేలా మార్చుకున్న అవకాశాల్ని కుదించేసుకుంటున్నారు. ఎవరి ధోరణులకు భయపడి 2014లో ప్రజలు చంద్రబాబును గెలిపించారో, ఆ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ గెలిచినా ఆశ్చర్యపోనక్కర్లేదనే పరిస్థితిని కల్పిస్తున్నారు. కర్ణాటక ఎన్నికల తర్వాత బీజేపీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మొదలుపెట్టిన రాజకీయ యుద్ధంలో గెలవాలంటే.. సుపరిపాలన నిజంగా అవసరమని చంద్రబాబు గుర్తించాలి.

విధానాలు, ఆలోచనల ఆవశ్యకత గురించి చెప్పుకునే క్రమంలో **ఉద్యమపార్టీగా తెలంగాణలో ఇటీవల ప్రారంభమైన తెలంగాణ జనసమితి (టీజేఎస్) పార్టీ గురించి కూడా కొంత ప్రస్తావించుకోవాలి.**

టీజేఎస్ పార్టీ నాయకత్వం తెలంగాణ ఉద్యమ సమయంలో ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జేఏసీ)కి కూడా నాయకత్వం అందించింది. ఎలాంటి తెలంగాణ కావాలి.. అనే స్పష్టతకు ప్రాధాన్యత ఇవ్వకుండా కేవలం భౌగోళిక తెలంగాణకు ప్రాధాన్యమివ్వటం వల్ల జరిగిన నష్టమేంటో వారికి ఇప్పటికే అర్థమైంది. టీజేఎస్ కూడా లోక్‌సత్తా నమూనాలో ఉద్యమం నుంచి పార్టీగా మారి ఉద్యమాన్నీ, పార్టీనీ కొనసాగిస్తున్నప్పటికీ.. విధానపరమైన దృక్కోణం, విస్తృతి, ప్రమాణాల విషయంలో మౌలికమైన తేడా ఉంది. జేఏసీ నాయకత్వం పట్ల గ్రామీణ ప్రాంతాలు సహా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆదరణ, సానుభూతి ఉన్నా కూడా.. కేసీఆర్ పాలనపై వారి విమర్శల్ని ప్రజలు అంతగా పరిగణలోకి తీసుకోవటం లేదు. కేసీఆర్ కంటే మెరుగ్గా జేఏసీ నాయకత్వం ఏదో చెబుతోందన్న భావన ఎక్కువ శాతం ప్రజల్లో కలగలేదు. కానీ లోక్‌సత్తా విషయంలో అలా కాదు. పాలకులు చెబుతున్న విధానాల కంటే లోక్‌సత్తా విధానాలు ఎంతో మెరుగైనవని అంగీకరించనివారు చాలా తక్కువ. లోక్‌సత్తాకు ఓటు వేయకపోయినా, లోక్‌సత్తా విధానాలకు అత్యధికశాతం ప్రజల్లో ఆదరణ ఉంది. పార్టీలు, ఉద్యమాలు, పోరాటాలు.. వీటన్నిటికీ కాలం గడుస్తున్నకొద్దీ ప్రజాభిప్రాయం కన్నా కూడా ప్రజాప్రయోజనాలే తుది ప్రాతిపదిక! అందుకే విధానపరమైన స్పష్టతకు తొలిప్రాధాన్యతనివ్వటం చాలా అవసరం. ఇటీవల టీజేఎస్ కూడా విధానాల మీద దృష్టిపెట్టిందని, అంశాలవారీగా నిర్మాణాత్మక ఆలోచనలను ఆహ్వానిస్తోందని మిత్రులు అంటున్నారు. టీఆర్ఎస్, టీజేఎస్, కాంగ్రెస్, తెదేపా, వైకాపా, జనసేన, బీజేపీ, ఇంకో పార్టీ.. ప్రజాప్రయోజనాల కోసం నిర్దిష్ట విధానాలతో ప్రజలను భాగస్వాముల్ని చేస్తూ ఎవరు పనిచేసినా వారికి పార్టీలకతీతంగా తన వంతు సహాయసహకారాలు అందించటానికి లోక్‌సత్తా ఎప్పుడూ సిద్ధం. అంతిమంగా ప్రజలకు పనిజరగటం ప్రధానం!

చట్టబద్ధపాలన, ఉమ్మడి అవసరాలను తీర్చే మౌలిక వసతులు, నాణ్యమైన విద్య-ఉపాధి, ఆరోగ్యం, జవాబుదారీతనంతో పౌరసేవలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, వ్యవసాయంలో ఆదాయం లేకుండా.. రుణమాఫీలు, తాత్కాలిక పథకాలు, కానుకలు, నిరుద్యోగ భృతి, ఫిరాయింపులు, కులాలవారీ స్కీముల రాజకీయాలతో ప్రజల్ని మభ్యపెట్టాలనుకుంటే ఎల్లకాలం సాగదు. కేసీఆర్, చంద్రబాబు, కోదండరాం, జగన్, పలువురు కమ్యూనిస్టు, కాంగ్రెస్ నేతల పిల్లలేమో విదేశాల్లో చదువుకోవాలి.. సామాన్య ప్రజల పిల్లలు మాత్రం నాణ్యతలేని చదువులు చదువుతూ, ప్రభుత్వం విదిలించే వెయ్యి, రెండు వేలకు అర్రులు జాస్తూ వ్యవసాయం వండగ, స్వర్ణయుగం వచ్చింది అని మురిసిపోతుండాలా?! ఎంత సమసమాజం వచ్చినా.. పైస్థాయిలో ఓ 10శాతం మందే కొనసాగుతూ ఉంటారు. సామర్థ్యాలవారీగా వివిధ హోదాలు కూడా కొనసాగుతూంటాయి. కానీ "పైహోదాలోకి వెళ్లటాన్ని నిర్ణయించేది- 'పుట్టుక' కాకూడదు. ఏ తల్లి గర్భాన పుట్టింది అనే దాని బట్టి బిడ్డల భవిష్యత్తు నిర్ణయం కాకూడదు. ఏ స్థాయికైనా ఎదిగే, వికసించే అవకాశాలు హక్కుగా ప్రతి పిల్లకూ, పిల్లవాడికీ అందాలి.'' పుట్టుకతో వివక్షను తొలగించేందుకు, నివారించదగ్గ బాధలను తొలగించేందుకు తగిన విధానాలున్న రాజకీయం, పాలన చేస్తేనే.. తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో కూడా గుణాత్మక మార్పు సాధ్యమవుతుంది. *

# తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో కృష్ణా టాప్




**2017-**18 ఆర్థిక సంవత్సరంలో స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ)లో కృష్ణా జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలువగా.. విజయనగరం అట్టడుగున నిలిచింది. ఆ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జీఎస్‌డీపీ) రూ. 8,03,873 కోట్లు కాగా, అందులో అత్యధిక శాతం వాటా (రూ. 97,059 కోట్లు) కృష్ణా జిల్లా నుంచి సమకూరింది. అత్యల్ప వాటా (రూ. 28,360 కోట్లు) విజయనగరం జిల్లా నుంచి వచ్చింది. ఇటీవల కలెక్టర్ల సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జిల్లాల ఆర్థిక వ్యవస్థల గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి.

**జిల్లాలవారీగా తలసరి ఆదాయం వివరాలు**

| జిల్లా పేరు | తలసరి ఆదాయం (రూ. లక్షల్లో) |
|---|---|
| కృష్ణా | 1,89,121 |
| విశాఖపట్నం | 1,78,166 |
| పశ్చిమ గోదావరి | 1,72,006 |
| నెల్లూరు | 1,56,106 |
| గుంటూరు | 1,41,098 |
| తూర్పు గోదావరి | 1,36,007 |
| చిత్తూరు | 1,35,008 |
| ప్రకాశం | 1,34,014 |
| కడప | 1,25,319 |
| కర్నూలు | 1,19,638 |
| అనంతపురం | 1,18,451 |
| విజయనగరం | 1,05,434 |
| శ్రీకాకుళం | 99,792 |

**ఉపరంగాలవారీగా మొదటి మూడు స్థానాల్లో ఉన్న జిల్లాలు**

1) వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపరంగాలవారీగా..

- వ్యవసాయం-ఉద్యానవనం- అనంతపురం, చిత్తూరు, కర్నూలు
- పశుపోషణ- ప్రకాశం, కృష్ణా, పశ్చిమ గోదావరి
- మత్స్యపరిశ్రమ- కృష్ణా, పశ్చిమ గోదావరి, నెల్లూరు

2) పారిశ్రామిక రంగంలో..

- గనులు, క్వారీలు- తూర్పు గోదావరి, ప్రకాశం, కర్నూలు
- తయారీరంగం- విశాఖపట్నం, గుంటూరు, చిత్తూరు
- విద్యుత్తు, గ్యాస్, నీటి సరఫరా తదితరాలు- కృష్ణా, చిత్తూరు, గుంటూరు
- నిర్మాణరంగం- తూర్పు గోదావరి, కృష్ణా, విశాఖపట్నం

3) సేవారంగంలో..

- ట్రేడ్, హోటళ్లు, రెస్టారెంట్లు- విశాఖపట్నం, కృష్ణా, తూర్పు గోదావరి
- రవాణా, నిల్వ సదుపాయాలు- కృష్ణా, విశాఖపట్నం, గుంటూరు
- కమ్యూనికేషన్లు- కృష్ణా, విశాఖపట్నం, తూర్పు గోదావరి
- ఆర్థిక సేవలు- విశాఖపట్నం, కృష్ణా, గుంటూరు
- స్థిరాస్తి- విశాఖపట్నం, కృష్ణా, తూర్పు గోదావరి
- ప్రజా పరిపాలన- విశాఖపట్నం, కృష్ణా, అనంతపురం
- ఇతర సేవలు- తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా

- పారిశ్రామిక, సేవారంగాలలో విశాఖపట్నం అగ్రస్థానంలో ఉండగా.. వ్యవసాయ-అనుబంధ రంగాల్లో కృష్ణా జిల్లా మొదటిస్థానం దక్కించుకుంది.
- వ్యవసాయ-అనుబంధ రంగాల్లో శ్రీకాకుళం, పారిశ్రామిక, సేవారంగాల్లో విజయనగరం జిల్లాలు అట్టడుగున ఉన్నాయి.
- పారిశ్రామిక, సేవారంగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విశాఖపట్నం వ్యవసాయ-అనుబంధ రంగాల్లో చివరి నుంచి మూడో స్థానంలో ఉంది.
- వ్యవసాయ-అనుబంధ రంగాలు, సేవారంగంలో మొదటిస్థానంలో నిలిచిన కృష్ణా జిల్లా పారిశ్రామికంగా నాలుగో స్థానంలో ఉంది.
- పారిశ్రామిక రంగంలో వెనుకబడిన అనంతపురం వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఐదో స్థానంలో నిలిచింది.
- తలసరి ఆదాయంలో కృష్ణా జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా, శ్రీకాకుళం జిల్లా చివరి స్థానంలో ఉంది. విశాఖ, పశ్చిమ గోదావరి రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.
- 2017-18 అడ్వాన్స్ అంచనాల మేరకు రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1, 42,054గా పేర్కొన్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం రూ.1,23 ,664గా ఉంది. జాతీయ స్థాయిలో తలసరి ఆదాయం రూ.1,12,764గా ఉంది. దాంతో పోలిస్తే రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.29, 290 అధికం.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ (ఏపీఎస్ఎఫ్సీ) ఇచ్చిన రుణాల మీద వడ్డీ రూపేణా వచ్చిన ఆదాయంలో 3.2 శాతం వృద్ధి నమోదైంది.

2018-19లో జీవీఏ వృద్ధి లక్ష్యం రూ.8.82 లక్షల కోట్లు

రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం 2018-19 సంవత్సరానికి

### ఆస్పత్రులపై అశ్రద్ధ

ఆస్పత్రి అభివృద్ధి కమిటీల సమావేశాలు సజావుగా సాగటం లేదని గణాంకాలు స్పష్టంచేశాయి. నిబంధనల ప్రకారం నెలకోసారి తప్పనిసరిగా సమావేశమై ఆస్పత్రుల్లో అభివృద్ధిపరంగా తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాలి. బోధనాస్పత్రుల అభివృద్ధి కమిటీలకు జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇతర ఆస్పత్రులకు ప్రభుత్వం నియమించిన వారు ఛైర్మన్లుగా వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల సమావేశాలు నిర్వహించకుండా నిర్ణయాలు తీసేసుకుని ఆ తరువాత వాటికి ఆమోదం తీసుకుంటున్నారు. అత్యవసర సమయాల్లో మినహా మిగిలిన సందర్భాల్లో కమిటీ సమావేశాల్లో చర్చించిన అనంతరమే అధికారిక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. మరోవైపు సమావేశాలను నిర్వహించినా ఆన్‌లైన్‌లో నమోదు చేయట్లేదు. ప్రాథమిక ఆస్పత్రులు 1,171 ఉంటే.. కేవలం 458 సమావేశాలు జరిగాయి, 713 జరగలేదు. బోధనాస్పత్రులు 24 ఉంటే.. ఒకే ఒక్క సమావేశం జరిగింది, 23 మీటింగులు జరగలేదు.

### మంత్రులు, ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలి

జిల్లాలవారీ ఆదాయం (జీడీడీపీ) పట్టికలో, తలసరి ఆదాయంలో విజయనగరం జిల్లా అట్టడుగున, అడుగు నుంచి రెండో స్థానంలో ఉండటంపై కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, మంత్రులు సుజయకృష్ణ రంగారావు, గంటా శ్రీనివాసరావు, జిల్లా ప్రజాప్రతినిధులు ప్రజలకు సమాధానం చెప్పాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మీడియా ద్వారా డిమాండ్ చేశారు. పరిశ్రమలు మూతపడుతున్నాయని, భూసేకరణ రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారిందని, వ్యవసాయోత్పత్తులకు డిమాండ్ ఉన్నా ధర రావటం లేదని, వీటిపై దృష్టి పెట్టాలని ఎన్నిసార్లు మొత్తుకున్నా ఆ నేతలకు పట్టలేదన్నారు. లోక్‌సత్తా పార్టీ నేతలు బూడి సన్యాసినాయుడు, ఎం.చిన్నారావు, తాత్రాజు రాజారావు, శిమ్మ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. సాధించాల్సిన వృద్ధి రేటు లక్ష్యాలను రంగాలవారీగా నిర్దేశించింది. 2018-19 సంవత్సరానికి సంబంధించి 2011-12 సంవత్సర స్థిర ధరల (కాన్‌స్టెంట్ ప్రైసెస్) ఆధారంగాను, ప్రస్తుత ధరల (కరెంట్ ప్రైసెస్) ఆధారంగాను ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. మళ్లీ 2018-19 సంవత్సరం మొదటి త్రైమాసికానికి స్థిర ధరల ఆధారంగా రూ. 6,32,826 కోట్లు, ప్రస్తుత ధరల ఆధారంగా రూ. 8,82,612 కోట్లు స్థూల విలువ జోడింపు (జీవీఏ) సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రధాన రంగాలవారీగా నిర్దేశించిన లక్ష్యాలు ఇలా ఉన్నాయి.. (అంకెలు రూ. కోట్లలో)

| రంగం | స్థిర ధరల ప్రకారం | ప్రస్తుత ధరల ప్రకారం | శాతంలో |
|---|---|---|---|
| వ్యవసాయం | 1,97,842 | 3,19,397 | 22.66 - 28.56 |
| పరిశ్రమలు | 1,61,502 | 1,89,285 | 13.07 - 16.50 |
| సేవారంగం | 2,73,482 | 3,73,930 | 13.02 - 16.71 |
| మొత్తం జీవీఏ | 6,32,826 | 8,82,612 | 15.91 - 20.74 |

*




# ఉత్తరాంధ్రకు ఏం చేశారో చెప్పండి చంద్రబాబూ!

## లోక్‌సత్తా 'ఉత్తరాంధ్ర ప్రజల ఆత్మగౌరవ దీక్ష'కు మద్దతు పలికిన పార్టీలు-

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్తరాంధ్రకు ఏమి చేశారో తన నోటితోనే ప్రజలకు వివరిస్తే మంచిదని పలు రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. కొత్త రాష్ట్రం ఏర్పడ్డాక కూడా ఉత్తరాంధ్రకు అన్యాయం కొనసాగుతోందని, ఈ నేపథ్యంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ చేపట్టిన ఆత్మగౌరవ దీక్ష అభినందనీయమని పేర్కొన్నారు.






ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారం కోసం విజయనగరం మయూరి జంక్షన్ వద్ద బాబ్జీ చేపట్టిన దీక్షను సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణ మూర్తి (నాని) ప్రారంభించారు.

జిల్లాలో పరిశ్రమలు మూతపడినా, రైతులు అకాల మరణం చెందుతున్నా తెలుగుదేశం నేతలు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని, ఈ ప్రాంతంలోని మూడు జిల్లాలూ ఎంతో వెనుకబడి ఉన్నాయని మూర్తి అన్నారు. పార్లమెంట్ మాజీ సభ్యుడు డి.వి.జి శంకరరావు మాట్లాడుతూ, విజయనగరం జిల్లా తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో చివరి వరసలో ఉండటం అందరికీ సిగ్గుచేటన్నారు. పరిశ్రమలు మూతపడి పలువురు వలస పోతున్నారన్నారు. జిల్లా ప్రజలకు సరైన విద్య, వైద్యం అందటం లేదన్నారు. వెనుకబడిన ఈ ప్రాంతం మీద ప్రభుత్వం దృష్టి పెట్టకపోతే మున్ముందు తీవ్ర పరిణామాలు ఎదురవుతున్నాయన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పైరవీలు, పదవుల కోసం వెంపర్లాడుతున్నారని, ఎవరికీ ప్రజాసమస్యల మీద అవగాహన కూడా లేదని సీపీఎం నేత రమణ అన్నారు. కాంగ్రెస్ నేత యడ్ల ఆదిరాజు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ వల్ల ప్రజలకు ఎటువంటి లాభమూ లేదని, చంద్రబాబుకు పబ్లిసిటీ పిచ్చి పట్టిందని ఎద్దేవా చేశారు. దీక్షలో బాబ్జీకి మద్దతుగా ఆంధ్రచైతన్య పార్టీ అధ్యక్షుడు రామానాయుడు కంటుభుక్త కూడా కూర్చున్నారు. బీఎస్పీ అధ్యక్షుడు శివప్రసాద్, బీజేపీ ప్రతినిధి మధు, పారిశ్రామికవేత్త నాగిరెడ్డి, జనవిజ్ఞానవేదిక కృష్ణాజీ, బీసీ సంఘాల ప్రతినిధులు ఆదినారాయణ, రామారావు, ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నేతలు సదాశివరావు, ఈశ్వరరావు, దళిత సంఘాల నేతలు ఆర్.మోహన్, పి.వి రమణ, కళాకారులు దేవీశ్రీ, జానకిరాం, డప్పురాజు, లోక్‌సత్తా పార్టీ నేతలు పాల్గొన్నారు. *

# ఒప్పంద సేద్యంపై కేంద్రం కొత్త చట్టం

- డాక్టర్ పరిటాల పురుషోత్తం,
'సెస్'లో ఆచార్యులు

నేడు దేశంలో అనేక సంస్థలు రైతులతో ఒప్పంద సేద్యం (కాంట్రాక్ట్ ఫార్మింగ్) చేయిస్తున్నా, అది పరస్పర నమ్మకం మీదే జరుగుతోంది తప్ప చట్టపరమైన ప్రాతిపదిక లేదు. దాంతో ప్రభుత్వానికి ఈ తరహా సేద్యంపై నియంత్రణ కొరవడి రైతుకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కాంట్రాక్టు కుదుర్చుకున్న సంస్థ అనుకున్న సమయానికి నిర్ణయించిన ధరకు పంట కొనకపోతే న్యాయం కోసం రైతు కోర్టుకు వెళ్లలేక పోతున్నాడు. పరిస్థితిని చక్కదిద్దడానికి నిరుడు డిసెంబర్ 24న కేంద్రప్రభుత్వం ఆదర్శ ఒప్పంద సేద్యం ((ప్రోత్సాహం, అభివృద్ధి) ముసాయిదా చట్టం (2018) రూపొందించింది. ధరల్లో విపరీతమైన వ్యత్యాసాల వల్ల రైతులు నష్టపోకుండా చూడటం ఈ ముసాయిదా చట్ట లక్ష్యం. ఆహారశుద్ధి సంస్థలు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంలో, మౌలిక వసతుల కల్పనలో భారీగా పెట్టుబడి పెట్టేలా ఈ చట్టం ప్రోత్సహిస్తుంది. దీన్ని అమలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. ముసాయిదా పై అభిప్రాయాలు చెప్పి, సలహాలు సూచనలు ఇవ్వాల్సిందిగా రైతులు, రైతు సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం కోరింది. స్వచ్ఛంద సంస్థలు, ఒప్పంద సేద్య సంస్థలు, సంబంధిత కంపెనీలతో పాటు సాధారణ ప్రజల అభిప్రాయాలనూ కేంద్ర వ్యవసాయ శాఖ ఆహ్వానించింది.

**అపనమ్మకాలకు మూలం**

రైతుకు, సంస్థలకు మధ్య కుదిరే ఒప్పందాలకు చట్టపరమైన పునాది లేకపోవడం అపనమ్మకాలకు తావిస్తోంది. అయితే ఒప్పంద వ్యవసాయం వల్ల



పంటల విస్తీర్ణం పెరిగి, రైతులకు ఆదాయాలకు, కంపెనీలకు లాభాలు హెచ్చి మొత్తం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపు వస్తుంది కాబట్టి దాన్ని తప్పక ప్రోత్సహించాల్సిందే. దళారులు, వడ్డీ వ్యాపారుల చేతిలో రైతులు మోస పోకుండా నివారించడానికి కాంట్రాక్టు సేద్యం తోడ్పడగలదు. ఇందులోనూ ఎన్నో లొసుగులు ఉన్నాయి. పలు సందర్భాల్లో ఒకే ఒప్పంద సంస్థ వందలు, వేలమంది రైతుల ఉత్పత్తిని కొనుగోలు చేస్తోంది. రైతులకు మార్కెట్ గురించి సరైన సమాచారం లేకపోవడం వల్ల బాగా నష్టపోతున్నారు. ఆ సమాచారాన్ని గుప్పిట్లో పెట్టుకున్న ఒప్పంద సంస్థ లాభాలు మూటగట్టుకుంటోంది. అలాగే ముందు ఒప్పుకున్న ధరకన్నా విపణి ధర ఎక్కువున్నా, తక్కువున్నా ఒప్పందాన్ని ఉల్లంఘించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఒప్పంద సంస్థలతోపాటు రైతులూ ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడుతుంటారు. అలాంటప్పుడు ఉభయుల మధ్య కుదిరిన ఒప్పందాన్ని కచ్చితంగా అమలు చేయించే చట్టమేదీ లేదు. ప్రభుత్వ నియంత్రణా లేదు. దీనివల్ల తరచూ కాంట్రాక్టు సేద్యం విఫలమవుతోంది. చాలా సందర్భాల్లో ఒప్పంద సంస్థ ముందు ఒప్పుకున్న ధరకన్నా విపణి ధర తక్కువగా ఉంటే ఏదో వంక పెట్టి పంట కొనకుండా ఎగవేస్తుంది. ఇది చిత్తూరు జిల్లా టమాటా రైతులకు అనుభవమే. కృష్ణా, ప్రకాశం, ఖమ్మం జిల్లాల్లో సుబాబుల్ రైతులకు బకాయిలు చెల్లించడంలో ఒప్పంద సంస్థలు విపరీతంగా ఆలస్యం చేస్తున్నాయి. ప్రస్తుతం కుదురుతున్న కాంట్రాక్టుల్లో అత్యధికం ఒప్పంద సంస్థకే అనుకూలంగా ఉంటూ రైతు ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి. ఒకవేళ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దెబ్బతింటే నష్టమంతా రైతులే భరించాలి తప్ప ఒప్పంద సంస్థ పైసా నష్టం భరించదు. ఒప్పంద సంస్థలు ఎప్పుడంటే అప్పుడు ఒప్పంద ధర మార్చేసే వెసులుబాటును అట్టిపెట్టుకుని రైతుకు మాత్రం ఆ సౌలభ్యం లేకుండా చేస్తాయి. మార్కెట్ ధర కన్నా బాగా తక్కువకు కొని సొమ్ము చేసుకోవాలని చూస్తాయి. చిత్తూరు జిల్లాలో ఘెర్కిన్ (చిట్టి దోసకాయల) సాగుదారులకు ఇది బాగా అనుభవం. తమిళనాడులో బ్రాయిలర్ కోళ్ల పెంపకందారులనూ ఒప్పంద సంస్థలు ముప్పతిప్పలు పెడుతుంటాయి. బకాయిలను 60 రోజులు ఆలస్యంగా చెల్లించడం ఈ సంస్థలకు ఆనవాయితీ. ఒప్పందం ప్రకారం నిర్దిష్ట సంఖ్యలో కోళ్లను పెంచాల్సి ఉంటుంది కాబట్టి రైతులు అందుకోసం భారీ పెట్టుబడి పెడతారు. తీరా సరకు కొనే సమయం

## చిన్నరైతుకు పెద్ద భరోసా

చిన్న రైతులను ఒప్పంద సేద్యంలో పటిష్ఠ భాగస్వాములను చేస్తే నేడు భారత వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. రుణాలిచ్చే సంస్థలు, బీమా కంపెనీలు, విస్తరణ యంత్రాంగం చిన్నరైతును నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శలు రావడం తెలిసిందే. కాంట్రాక్టు సేద్యం వీటికి పరిష్కారం చూపగలుగుతుంది. పెద్ద కంపెనీలతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు చిన్న రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమాచారం, పంటను మంచి ధరకు విపణిలో విక్రయించే వెసులుబాటు, సులభ షరతులపై రుణాలు లభిస్తాయి. లావాదేవీల ఖర్చు తగ్గుతుంది. కంపెనీల యాజమాన్య నైపుణ్యాలతో వారు లబ్ధి పొందగలుగుతారు. చిన్న రైతులకు సేద్యంలో ఆధునిక మెలకువలు అలవడి సామర్థ్యం పెరుగుతుంది. పెట్టుబడులు, గిట్టుబాటు ధరలు అందడంతో నష్టభయం తగ్గుతుంది. కాంట్రాక్టు సంస్థలు రైతులకు మేలైన ఎరువులు, విత్తనాలు, క్రిమినాశనులు, విస్తరణ సేవలు అందేలా చూస్తాయి. పంటల నాణ్యతపై ఎప్పటికప్పుడు నిఘా వేస్తాయి. ఫలితంగా ఆహారశుద్ధి పరిశ్రమలు వృద్ధి చెంది విస్తరిస్తాయి. దానివల్ల వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులూ ఇనుమడిస్తాయి. కాబట్టి ఒప్పంద సేద్యం సక్రమంగా జరిగితే రైతుల ఆదాయాలు పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వికసిస్తుంది. ఇటీవలికాలంలో రైతుకు అధిక ఆదాయం తెచ్చిపెట్టే పండ్లు, పూలు, కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపల ఉత్పత్తి వైపు మొగ్గు పెరిగింది. అయినా దేశంలో ఒప్పంద వ్యవసాయం గొప్పగా విజయవంతమైన దాఖలా లేదు. కాంట్రాక్టు సంస్థలకు, రైతులకు మధ్య నెలకొన్న అపనమ్మకాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. అలాగని అసలు విజయగాథలు లేవని కాదు. పెద్ద కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా మధ్యప్రదేశ్‌లో మిర్చి, కుసుమ పంటల సాగులో, తెలంగాణలో సంకర విత్తనాలు, మహారాష్ట్రలో ద్రాక్ష, అరటి పండ్ల సాగులో చిన్న రైతులు విజయాలు సాధించి ఆదాయాలు పెంచుకోగలిగారు.

వచ్చేసరికి ఒప్పంద సంస్థలు ధరల్లో మాయాజాలానికి పాల్పడతాయి. రైతులు మాత్రం ఒప్పందం నుంచి తప్పించుకోలేరు. కొంతమంది మోసగాళ్లయితే పంట కొనాల్సిన సమయానికి పత్తా లేకుండా పోతారు. ఈ పరిస్థితిలో అనేక కాంట్రాక్టు సేద్య ప్రాజెక్టులు విఫలమయ్యాయంటే ఆశ్చర్యమేముంది? రైతులు, ప్రాయోజక సంస్థలకు మధ్య కుదిరే ఒప్పందాలను సాధికారంగా నమోదు చేసే సదుపాయం లేకపోవడంతో ప్రభుత్వమూ జోక్యం చేసుకోలేకపోతోంది. ఈ లోపాలను సరిదిద్దడానికి కొత్త చట్టాన్ని ప్రతిపాదిస్తోంది.

ప్రతిపాదిత చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పంద సేద్య ప్రోత్సాహం, అభివృద్ధి ప్రాధికార సంస్థలను ఏర్పరుస్తాయి. ప్రాయోజక సంస్థలకు, రైతులకు మధ్య కుదిరే కాంట్రాక్టులను నమోదు చేసి, సక్రమంగా అమలయ్యేలా చూడటానికి జిల్లా, మండల, బ్లాకు స్థాయుల్లో ప్రత్యేక సంఘాలను నెలకొల్పుతారు. వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మార్కెటింగ్, గ్రామీణాభివృద్ధి, సహకార తదితర శాఖలకు చెందిన అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సంఘాలను ఏర్పాటు చేస్తుంది. వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ కమిటీల (మండీల) పరిధిలోకి ఒప్పంద సేద్యం రాదు. ప్రతిపాదిత ఒప్పందంలో ముఖ్యాంశం ఇదే. మండీలు దళారుల ఇష్టారాజ్యాలుగా మారి రైతుల పొట్ట కొడుతున్నాయనే ఆరోపణల మధ్య ఇది ఎంతో ప్రాముఖ్యం సంతరించుకొంటోంది.

### రాష్ట్రాలపై గురుతర బాధ్యత

కొత్త చట్టం సక్రమంగా అమలై రైతులకు గరిష్ఠ ప్రయోజనం సిద్ధించాలంటే పొలం, గ్రామం, పంచాయతీ, మార్కెట్ స్థాయుల్లో పంటల గ్రేడింగ్‌కు పటిష్ఠ యంత్రాంగాన్ని నెలకొల్పాలి. ఒప్పంద సంస్థలు, రైతుల మధ్య విభేదాలను 15 రోజుల్లో పరిష్కరించే ఏర్పాటు ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ స్థాయి అధికారులను పరిష్కర్తలుగా నియమించాలి. ఆ అధికారి నిర్ణయం నచ్చనప్పుడు రైతుగాని, ఒప్పంద సంస్థగాని న్యాయం కోసం 30 రోజుల్లో ప్రాధికార సంస్థకు విజ్ఞాపన చేసుకోవచ్చు. ఉభయుల వాదనలు విన్న తరవాత పక్షం రోజుల్లో ప్రాధికార సంస్థ తీర్పు చెప్పాలి. అదే అంతిమ నిర్ణయం అవుతుంది. ఈ సంస్థకు సివిల్ కోర్టు ప్రతిపత్తి ఉంటుంది. సాధారణ సివిల్ కోర్టులు ఇక్కడ జోక్యం చేసుకోవడానికి వీల్లేదు. ప్రాధికార సంస్థ తీర్పును గౌరవించని రైతులు, ఒప్పంద సంస్థలు జరిమానాలు, నష్టపరిహారాలు చెల్లించకతప్పదు. నేడు దేశమంతటా పండ్లు, కూరగాయలు, సుబాబుల్, చెరకు వంటి పంటలను కాంట్రాక్టు పద్ధతిలో సాగు

చేస్తున్న నేపథ్యంలో రైతులను మార్కెట్ ధరల మాయాజాలం నుంచి రక్షించే విధంగా కొత్త చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి. ఒకవేళ విపణిలో ఏదైనా పంట ధర పతనమైతే నష్టాన్ని ప్రాయోజక సంస్థే భరించాలి. అనేక రాష్ట్రాలు ఆమోదించిన వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ) చట్టాల్లో కాంట్రాక్టు సేద్యాన్ని ప్రోత్సహించే నిబంధనలు ఉన్నా, కేంద్రం పూర్తిగా కొత్త చట్టాన్ని తీసుకురావాలని నిశ్చయించింది. ఒప్పంద సేద్య వివాదాల్లో ఏపీఎంసీలు మధ్యవర్తులుగా వ్యవహరించే అవకాశమివ్వరాదన్న ఉద్దేశంతో ఈ చట్టాన్ని తీసుకొస్తోంది.

దళారులు, వ్యాపారులు కుమ్మక్కయి పంటలకు మార్కెట్ ధరలను తగ్గించేసి రైతు పొట్టకొడుతున్న సంగతి అందరికీ తెలుసు. ఈ అన్యాయాన్ని సరిదిద్దడానికి మార్కెట్ సంస్కరణలు తీసుకురావాలి. కాంట్రాక్టు సేద్య చట్టం చేసి చేతులు దులిపేసుకుంటే సరిపోదన్నది కొందరు నిపుణుల వాదన. రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చూసే సంస్కరణలు అమలులోకి వస్తే ఒప్పంద సేద్యం దానంతటదే వ్యాపిస్తుందని వారు అంటున్నారు. ఈ చట్టం విజయవంతమవుతుందా లేదా అన్నది రాష్ట్ర ప్రభుత్వాల నిబద్ధతపై ఆధారపడి ఉంటుంది. చట్టం గురించి రైతుల్లో అవగాహన, చైతన్యం పెంచడం, అందరికీ ఆమోదనీయమైన గ్రేడింగ్ పద్ధతిని చేపట్టడం, పంటల నిల్వ సౌకర్యాల విస్తరణ, రైతులు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా సకాలంలో వారికి సంస్థాగత రుణాలు అందించడం, వ్యాపారులు, దళారీలు లాలూచీ పడి ధరలను కృత్రిమంగా తగ్గించకుండా జాగ్రత్త వహించడం– ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాల్సిన విధులు. రైతుల్లో సమష్టిగా బేరమాడే శక్తిని పెంచడానికి సంస్థాగత ఏర్పాట్లు చేయాలి. రైతులను మొదట చిన్నచిన్న బృందాలుగా సమీకరించి, తరవాత వాటిని అనుసంధానిస్తూ సమష్టిగా పెద్ద బృందాలను నిర్మిస్తే వారికి బేరమాడే శక్తి పెరుగుతుంది. సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులు కొత్త చట్టం అమలుకు చిత్తశుద్ధితో పనిచేసేట్టు చూడటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు కృషిని నిర్వహించాలి.

*(ఈనాడు సౌజన్యంతో)* *

# కేంద్రంపై ఒత్తిడి తెచ్చాం, ఇక యువత కూడా పోరాడాలి

విశాఖపట్నం కేంద్రంగా ఇచ్ఛాపురంతో కలిసిన రైల్వే జోన్ సాధన కోసం యువత ముందుకొచ్చి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. రైల్వే జోన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వరకు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో రైలు యాత్ర జరిగింది. ఈ యాత్రలో భాగంగా విజయనగరం చేరుకున్న నాయకులకు యువత, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు స్వాగతం పలికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, అఖిలపక్ష పోరాటంతో రైల్వే జోన్‌పై ఇప్పటికే కేంద్రంలో పెద్ద కదలిక వచ్చిందన్నారు. ఏప్రిల్‌లో విశాఖ నుంచి పలాస వరకు చేసిన రైలు యాత్రకు విశేష స్పందన లభించిందన్నారు. ఇక యువత కూడా భాగస్వాములై కదలాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, సాధన కమిటీ కన్వీనర్ జేవీవీ సత్యనారాయణమూర్తి, సీపీఎం నాయకుడు లోకనాథం, రామానాయుడు, వివిధ పార్టీల నేతలు రాజేష్, విజయకుమార్, వేణు, బంగారు నాయుడు, కామేశ్వరరావు, అశోక్, ఆదిరాజు,






శ్రీను, లోక్‌సత్తా నేతలు నాగభూషణం, నాయుడు, శ్రీను, రాజారావు, అప్పారావు, గురునాథం, భాస్కర్, పెద్దసంఖ్యలో యువత పాల్గొన్నారు. *

# తెలంగాణ గణాంకాలు – దార్శనిక పత్రం

## (2016-2018)

**కో**టి రతనాల వీణ తెలంగాణ 2014లో మూడున్నర కోట్ల జనాభాతో 29వ రాష్ట్రంగా అవతరించింది. పది జిల్లాల తెలంగాణ 2016లో 31 జిల్లాల రాష్ట్రంగా మారింది.

తెలంగాణ నాలుగేళ్ల ప్రస్థానాన్ని మరింత సమగ్రంగా అంచనా వేయటానికి వీలుగా... 2016 నుంచి 2018 తొలి అర్థభాగం వరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కొన్ని ముఖ్య గణాంకాల్ని, దార్శనిక పత్రాన్ని అందిస్తున్నాం.



# తెలంగాణ గణాంక దర్శిని-2016

ఆర్థిక సామాజిక స్థితిగతులకు అద్దం పడుతూ రంగాలవారీగా రాష్ట్రం సాధించిన పురోగతిని తెలియచేసే 2016 గణాంక దర్శినిలో 28 అధ్యాయాలున్నాయి. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలోని అర్థ గణాంక విభాగం డైరక్టరేట్ ఈ నివేదికను రూపొందించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి వరుసగా విడుదలైన గణాంక దర్శినిల్లో ఇది మూడవది. 2011 జనగణన వివరాలతోపాటు ఇటీవల కేంద్రప్రభుత్వం వెల్లడించిన ఆర్థిక గణన సమాచారం, 2014-15కు సంబంధించిన చిన్న నీటివనరుల సర్వే వివరాలు ఇందులో ఉన్నాయి. 'తెలంగాణ గణాంక దర్శిని-2016'లోని ముఖ్యాంశాలు..



- తెలంగాణ జనాభా 3.52 కోట్లు. దేశ జనాభాలో ఇది 2.91శాతం. మహిళలు 2.98శాతం, పురుషులు 2.84 శాతం. దేశంలోని మొత్తం కుటుంబాల్లో తెలంగాణ వాటా 3.33శాతం. ఎస్సీలు 2.69శాతం, ఎస్టీలు 3.04శాతం.
- దేశంలోని మొత్తం పసుపు సాగువిస్తీర్ణంలో 21.3శాతం తెలంగాణలోనే ఉంది. పత్తి 14.32శాతం, మిర్చి 10.19, మొక్కజొన్న 8.3, కంది 6.75, వరి 4.55శాతం సాగవుతున్నాయి.
- తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో తెలంగాణది దేశంలో ఏడో స్థానం. 2014-15 గణాంకాల ప్రకారం జాతీయ తలసరి ఆదాయం రూ.86,879కాగా, తెలంగాణలో రూ.1,29,182.
- 2013-14 పరిశ్రమల సర్వే ప్రకారం తెలంగాణలో 14,110 ఫ్యాక్టరీలున్నాయి. వీటిలో 6,29,361మంది పనిచేస్తున్నారు. మొత్తం 7,42,062 మంది ఉపాధి పొందుతున్నారు.
- రాష్ట్రంలో 1,676 కిలోమీటర్ల పొడవు రైలుమార్గాలున్నాయి
- 2015-16లో తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) రూ.5,22,001 కోట్లు. జీఎస్‌డీపీ వృద్ధి రేటు 11.71శాతం.
- రాష్ట్రంలో మొత్తం 83.04 లక్షల కుటుంబాలు, 92.71 గృహవినియోగ ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయి. 2014-15లో రాష్ట్రంలో 6.7లక్షల టన్నుల ఎల్పీజీ, 7.57లక్షల టన్నుల పెట్రోలు, 26.68 లక్షల టన్నుల డీజిల్ వినియోగమయ్యాయి
- రాష్ట్రంలో మొత్తం 78.38 లక్షల వాహనాలున్నాయి
- 65.66 లక్షలమంది పురుషులు, 62.89 లక్షలమంది మహిళలకు ఉపాధి జాబ్ కార్డులున్నాయి
- 4.28లక్షల స్వయంసహాయక సంఘాల్లో 47.15లక్షల సభ్యులున్నారు
- మొత్తంగా 33.85లక్షలమంది ఆసరా పెన్షన్లు అందుకుంటున్నారు
- మానవాభివృద్ధి సూచీ ర్యాంకుల్లో రాష్ట్రంలో హైదరాబాద్ మొదటి ర్యాంకులో, ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత జిల్లా మెదక్ చివరి స్థానంలో ఉన్నాయి
- 25.4లక్షల హెక్టార్లలో (22.66శాతం) అడవులున్నాయి. 43.77లక్షల హెక్టార్లలో (39.05శాతం) పంటలు సాగవుతున్నాయి. 14.01 లక్షల హెక్టార్లలో బీడు భూములున్నాయి. రాష్ట్రంలో సగటు భూకమతం పరిమాణం 1.12 హెక్టార్లు.
- రాష్ట్రంలో సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. 2010-11లో 44.92 లక్షల హెక్టార్లలో పంటలు సాగైతే, 2014-15లో 43.76లక్షల హెక్టార్లు సాగైంది. 2010-11లో 13.75లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఏడాదిలో రెండేసి పంటలు సాగు చేయగా.. 2014-15లో ఈ విస్తీర్ణం 9.38లక్షల హెక్టార్లకు పరిమితమైంది.
- ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉంది. తర్వాతి స్థానాల్లో మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాలు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 1.21 లక్షల హెక్టార్లలో బీడు భూములున్నాయి. కరీంనగర్‌లో 95,963, మహబూబ్‌నగర్ జిల్లాలో 87,562, ఖమ్మంలో 80,925 హెక్టార్లలో బీడు భూములున్నాయి.
- నాలుగో మైనర్ ఇరిగేషన్ సర్వే ప్రకారం రాష్ట్రంలో 6.30 లక్షల బావులు, 6.35లక్షల బోరుబావులు, 50వేల ఉపరితల నీటి వనరులతో వ్యవసాయం సాగుతోంది. 2013-14లో 31.54లక్షల హెక్టార్లకు సాగునీటి వసతి

## జనాభా కంటే చరవాణి కనెక్షన్లు ఎక్కువ

తెలంగాణ రాష్ట్రంలో జనాభా కంటే చరవాణి (మొబైల్) కనెక్షన్లు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో 3.52 కోట్ల జనాభా ఉండగా చరవాణి కనెక్షన్లు 3.66 కోట్లు ఉన్నాయి. చరవాణి కనెక్షన్లలో మూడో వంతు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉన్నాయి. సగటున ప్రతి కుటుంబంలో నలుగురు చరవాణులు ఉపయోగిస్తున్నారు.

ల్యాండ్ ఫోన్లు 6.24లక్షలు: రాష్ట్రంలో 6,24,224 ల్యాండ్ ఫోన్లు ఉన్నాయి. వీటికోసం 1314 టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లు పనిచేస్తున్నాయి. 13223 ప్రజా టెలిఫోన్లుండగా, వీటిలో సగం కంటే ఎక్కువ హైదరాబాద్, రంగారెడ్డిలోనే ఉన్నాయి. ఈ రెండు జిల్లాల్లో ఉన్న పీటీల సంఖ్య 8220. *

## అభివృద్ధి కేంద్రీకృతం- వ్యవసాయేతర ఆదాయమే అధికం

సంపన్న రాష్ట్రంగా చెప్పుకుంటున్నప్పటికీ తెలంగాణలో అభివృద్ధి అంతా మూడు జిల్లాల్లోనే కేంద్రీకృతమై ఉన్నట్లు జీఎస్‌డీపీ గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో, దానిని ఆనుకుని ఉన్న రంగారెడ్డి, మెదక్‌లలోనే స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం ఎక్కువగా ఉంది. రాష్ట్ర జీఎస్‌డీపీ వాటాలో 55శాతం వాటా ఈ మూడు జిల్లాల నుంచే ఉంది. ఈ మూడు జిల్లాల్లో వ్యవసాయేతర రంగాలే ఎక్కువని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలలో 2013-14తో పోలిస్తే 2014-15లో రెండు శాతం లోపే వృద్ధి ఉన్నట్టు గణాంకాలు సూచిస్తున్నాయి. వ్యవసాయంపై అత్యధికంగా ఆధారపడిన 7 జిల్లాల స్థూల ఉత్పత్తి జీఎస్‌డీపీలో 45శాతం మాత్రమే ఉండటం.. ఈ రంగంపై ఆధారపడినవారి జీవితాలు ఎలా ఉన్నాయో స్పష్టం చేస్తోంది.

2014-15లో అప్పటి ధరల ప్రకారం జీఎస్‌డీపీ రూ.5.22 లక్షల కోట్లు ఉంటే, ఇందులో హైదరాబాద్ వాటా రూ.1.25కోట్లు, రంగారెడ్డి వాటా రూ.1.20 కోట్లుగా ఉంది. మెదక్ జిల్లా డీడీపీ (డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రాడక్ట్) రూ.43,528 కోట్లుగా ఉంది. రంగారెడ్డి, మెదక్‌లలో కూడా హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాలలోనే స్థూల ఉత్పత్తి ఎక్కువగా ఉందని విశ్లేషిస్తున్నారు. మెదక్ డీడీపీ రూ.43,528 కోట్లు ఉన్నా ఇటీవల రైతు ఆత్మహత్యలు ఆ జిల్లాలోనే ఎక్కువగా జరిగాయి. నిజామాబాద్ అత్యంత తక్కువ డీడీపీ కలిగివుంది. నిజామాబాద్ జిల్లా డీడీపీ రూ.22,585 కోట్లు ఉంది.

ఆదిలాబాద్ డీడీపీ రూ.23,879 కోట్లు, కరీంనగర్ రూ.38,581 కోట్లు, మహబూబ్‌నగర్ రూ.37,203, నల్లగొండ రూ.45,072కోట్లు, వరంగల్ రూ.32,033కోట్లు, ఖమ్మం రూ.32,421 కోట్లు డీడీపీ నమోదైంది.

రాష్ట్ర తలసరి ఆదాయం 2014-15లో రూ.1,29,182గా చూపిన నివేదిక.. 2015-16లో రూ.1,43,023గా అంచనా వేసింది.

ఉండగా, 2014-15లో కేవలం 25.29లక్షల హెక్టార్లకు పరిమితమైంది.

- 2000-01లో 4.27లక్షల బోరుబావులుండగా.. 2006-07 సంవత్సరానికి వీటి సంఖ్య 6.62లక్షలకు చేరింది. తెలంగాణలో 77శాతం వ్యవసాయం బోర్లు, బావులపైనే ఆధారపడి వుంది. కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా 2.09 లక్షల వ్యవసాయ బావులున్నాయి. ఆ తర్వాతి స్థానంలో వరంగల్ జిల్లాలో 1.57లక్షల బావులున్నాయి. అతి తక్కువగా నిజామాబాద్ జిల్లాలో 7,220 బావులున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా 13,859 లోతైన బోరుబావులున్నాయి.
- రాష్ట్రంలో ఏటా 42.07లక్షల టన్నుల పాలు, 2.59 టన్నుల మాంసం, 2.45 టన్నుల చికెన్ ఉత్పత్తి అవుతోంది. 2014-15 గణాంకాల ప్రకారం 1,062 కోట్ల గుడ్లు ఉత్పత్తి అయ్యాయి. 2012 పశు గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 50.34లక్షల పశువులు, 41.04 లక్షల గేదెలు, 1.28 కోట్ల మేకలు, 46.75 లక్షల గొర్రెలు ఉన్నాయి. 2014-15లో 2.68 లక్షల టన్నుల చేపలు, రొయ్యలు ఉత్పత్తి అయ్యాయి.
- సింగరేణి ఆధ్వర్యంలోని 11 కోల్ మైన్స్‌లో 2008లో 71,176 మంది దినసరి కార్మికులుంటే.. 2015లో ఈ సంఖ్య 58,837కు చేరింది.
- గతేడాది మార్చి వరకు రాష్ట్రంలోని వివిధ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్నవారి సంఖ్య 4156. వీరిలో పురుషులు 3982. మహిళలు 184.
- 2014లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 7.23 లక్షల మంది రాష్ట్రంలో పర్యాటకానికి రాగా, 2015లో ఈ సంఖ్య 9.45 లక్షలకు చేరింది. విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా పెరిగింది. 2014లో 75,171 మంది విదేశీయులు రాగా, 2015లో ఆ సంఖ్య 1.26లక్షలకు చేరింది. *

# దార్శనిక పత్రానికి తెలంగాణ రాష్ట్ర పథకాలు

పదిహేనేళ్ల దార్శనికత, ఏడేళ్ల వ్యూహం, మూడేళ్ల కార్యాచరణపై నీతి ఆయోగ్ దార్శనిక పత్రంలో రాష్ట్రాలకు, రాష్ట్రాల అభిప్రాయాలకు ప్రత్యేకస్థానం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. తెలంగాణకు సంబంధించి ప్రతిష్టాత్మక పథకాలను విజన్ డాక్యుమెంట్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేసింది.

దార్శనిక పత్రం రూపొందించేందుకు అన్ని రాష్ట్రాలతో నీతి ఆయోగ్ సమావేశమైంది. ఈ క్రమంలో నీతి ఆయోగ్ సలహాదారుతో తెలంగాణ రాష్ట్ర ఉన్నతాధికారులు చర్చించారు. వ్యవసాయం, విద్యుత్, పురపాలన, తాగునీరు, సాగునీరు, వైద్య–ఆరోగ్యం, విద్య రంగాల గురించి తమ లక్ష్యాలను వివరించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి పొలానికీ సాగునీరు అందించటమే లక్ష్యంగా మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సాగునీటి ప్రాజెక్టులను అమలు చేస్తోందని ప్రణాళికా శాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చేందుకు 2.82 లక్షల కోట్ల రూపాయలతో ప్రణాళికలు రూపొందించినట్టు జీహెచ్ఎంసీ అధికారులు చెప్పారు.

**నీతి ఆయోగ్‌కి 2016లో తెలంగాణ పాలనా యంత్రాంగం ఇచ్చిన నివేదికలోని ముఖ్యాంశాలు కొన్ని ప్రధాన రంగాలలో..**

### పారిశ్రామిక రంగం

ఏటా అయిదు లక్షల మందికి ఉపాధి కల్పన, రూ.15వేల కోట్ల పెట్టుబడులు సమీకరణ, సంస్థలను ఆకర్షించేందుకు వీలుగా పెట్టుబడుల ప్రోత్సాహక విభాగం ఏర్పాటు లక్ష్యాలని నీతి ఆయోగ్‌కి తెలిపారు. ఇంకొన్ని అంశాలు..

- తయారీ రంగ వృద్ధి రేటును 12 శాతం నుంచి 17 శాతానికి పెంచటం
- తెలంగాణను అత్యుత్తమ పెట్టుబడుల కేంద్రంగా రూపొందిస్తాం
- తెలంగాణలో తయారీ బ్రాండ్లకు అంతర్జాతీయ గుర్తింపునకు కృషి
- తయారీరంగంలో 14 విభాగాల గుర్తింపు. నగరాలతో పాటు గ్రామీణ యువతకు ఉపాధి కల్పన
- తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2,534 పరిశ్రమలకు అనుమతి, రూ.44,542 కోట్ల పెట్టుబడుల సమీకరణ, 1,59,926 మందికి ఉపాధి కల్పన. అనుమతులిచ్చిన వాటిలో 1,124 పరిశ్రమల్లో ఉత్పత్తుల ప్రారంభం.

### వ్యవసాయ శాఖ

రానున్న మూడేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని విత్తన భాండాగారంగా మారుస్తాం. పంటల ఉత్పాదకత, దిగుబడులు పెంచుతాం.

- విత్తన పంటల సాగులో అధునాతన విధానాలు ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని విత్తన భాండాగారంగా మారుస్తాం
- వ్యవసాయ రంగంలో అభివృద్ధికి ఏడేళ్ల దీర్ఘకాలిక, మూడేళ్ల స్వల్పకాలిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాం
- రానున్న మూడేళ్లలో మార్కెట్ల నిర్వహణ పనులన్నీ ఆటోమేటిక్ యంత్రాలపై నడిచేలా ఆధునికీకరణ. పెద్ద మార్కెట్లను 12 నెలల్లోనే ఇలా మారుస్తాం.

### విద్యుత్తు రంగం

తెలంగాణ ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం.

- జాతీయ తలసరి విద్యుత్ వినియోగం 1,010 యూనిట్లు అయితే తెలంగాణలో గతేడాది (2015–16)లో 1,439 యూనిట్లు ఉంది
- మరో రెండేళ్ల (2018–19)లోగా 'అందరికీ విద్యుత్' సరఫరా లక్ష్యసాధనకు రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఈ లక్ష్యసాధనకు రూ.23,817 కోట్లు ఖర్చు పెట్టనున్నారు.

- వచ్చే ఆర్థిక సంవత్సరం ఆఖరుకల్లా 3,800 మెగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరతాం. అదనంగా మరో వెయ్యి మెగావాట్ల సౌరవిద్యుత్ కోసం ప్రయత్నాలు చేస్తాం.

## సాంకేతిక విద్యాశాఖ

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 56 పాలిటెక్నిక్ కాలేజీలున్నాయి. వాటిని వచ్చే 15 సంవత్సరాల్లో 200కు పెంచాలని కార్యాచరణ నిర్ణయించుకున్నాం. అందుకు మూలధన పెట్టుబడి రూ.1721 కోట్లు, మానవ వనరులకు రూ.828 కోట్లు అవసరమవుతాయి.

- ఇప్పుడు ప్రభుత్వ కళాశాలల్లో 15శాతం మంది, ప్రయివేటులో 10శాతం ప్రాంగణ నియామకాల్లో ఎంపికవుతున్నారు. దాన్ని వచ్చే 15 సంవత్సరాల్లో వరుసగా 70, 60శాతానికి పెంచుతాం.
- ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఇప్పుడు 15 ఉండగా, వాటిని 100కు పెంచుతాం

## ఉన్నత విద్య

వివిధ కోర్సుల్లో ప్రవేశానికి, విశ్వవిద్యాలయాలు, ఇతర ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉద్యోగ నియామకాలకు స్టేట్ ఏజెన్సీ ఫర్ టెస్టింగ్ (శాట్)ను ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదన

## వైద్య-ఆరోగ్య శాఖ

మాతాశిశు మరణాలను గణనీయంగా తగ్గించడం లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటోంది.

- మిలీనియం అభివృద్ధి లక్ష్యంలో నవజాత శిశు మరణాల రేటు ప్రతి వేయి మందికి 27, ఐదేళ్లలోపు పిల్లల మరణాలు 42 ఉండగా, ఇటీవల నిర్వహించిన జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ సర్వేలో తెలంగాణలో నవజాత శిశు మరణాలు 28గా, ఐదేళ్ల లోపు పిల్లల మరణాలు 32గా నమోదయ్యాయి
- మిలీనియం అభివృద్ధి లక్ష్యంలో బాలింత మరణాల రేటు ప్రతి లక్షమందికి 109 ఉండగా, తెలంగాణలో 92గా నమోదైంది
- ప్రసవానంతరం తల్లీబిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చడానికి 50వాహనాలను ఏర్పాటు చేశాం. త్వరలోనే ఈ పథకాన్ని ప్రారంభించాం.
- వచ్చే మూడేళ్లలో బాలింత మరణాలను 70కి, శిశు మరణాలను 20కి తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం

### 1,740 టీఎంసీల వినియోగమే లక్ష్యం

కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల్లో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలన్నింటికీ కలిపి 1,740 టీఎంసీల నీటిని వినియోగించుకోవడమే లక్ష్యం. వినియోగంలో, నిర్మాణంలో, ప్రతిపాదనలో ఉన్న అన్ని పథకాల కింద మొత్తం 54.27లక్షల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీటి వసతి కల్పిస్తాం.

- గోదావరి నుంచి 954.23 టీఎంసీలు, కృష్ణా నుంచి 785.21 టీఎంసీలు వినియోగించుకోవడం లక్ష్యం. కృష్ణాపై ఉన్న ప్రాజెక్టుల నుంచి 299 టీఎంసీలను వినియోగిస్తుండగా, 212 టీఎంసీల వినియోగానికి సంబంధించిన ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. పారిశ్రామిక, తాగునీటి అవసరాలతో పాటు సాగునీటి అవసరాలకు మరో 274.91 టీఎంసీల వినియోగ సామర్థ్యముండే పథకాలను చేపట్టాల్సి ఉంది. అన్ని ప్రాజెక్టుల కింద 46.18 లక్షల హెక్టార్ల ఆయకట్టు ఉండగా, మరో 8.09 లక్షల ఎకరాలకు అవకాశం ఉంది.
- నిర్మాణంలో ఉన్న 11 ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఏఐబీపీ కింద రూ.7,099 కోట్లు, మిషన్ కాకతీయ, ఆయకట్టు అభివృద్ధికి రూ.8వేల కోట్లు అవసరం. రాష్ట్ర నీటిపారుదల ప్రణాళిక ద్వారా సాగునీటి వసతిని 17,68,063 హెక్టార్ల నుంచి 46,16,352 హెక్టార్లకు పెంచడం, 9,46,871 హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ, నీటి వినియోగ సామర్థ్యాన్ని 30 నుంచి 50శాతానికి పెంచడం, సూక్ష్మసేద్యాన్ని 7,38,085 హెక్టార్ల నుంచి 15,14,325 హెక్టార్లకు విస్తరింప చేయడం, పంటల ఉత్పత్తిని 44శాతం, ఉత్పాదకతను 25శాతం పెంచటానికి చర్యలు చేపడుతున్నాం. *

# 31 జిల్లాల సమాచారంతో తెలంగాణ గణాంక దర్శిని - 2017

రాష్ట్ర ఆర్థిక, సామాజిక పరిస్థితులను వివరించే 2017 సంవత్సర గణాంక వివరాలివి. ముఖ్యమంత్రి కేసీఆర్, నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ రాజీవ్ కుమార్, సభ్యుడు రమేష్ చంద్, మంత్రులు, అధికారులు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తీసుకొచ్చిన నాలుగో పుస్తకమిది. ఇటీవలి సర్వేలు, ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఇతర రాష్ట్రాల వివరాలతో తెలంగాణ వివరాలను పోల్చి స్థానాలను నిర్ణయించారు. 85 శాఖల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా 28 చాప్టర్లతో 350 టేబుళ్లు రూపొందించారు. రాష్ట్ర జనాభా, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, అడవులు, పరిశ్రమలు, విద్యుత్తు, రవాణా, కమ్యూనికేషన్లు, పబ్లిక్ ఫైనాన్స్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, బ్యాంకులు, కార్మిక ఉపాధి కల్పన, విద్య, ఆర్థిక గణాంకాలు, స్థానిక ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ, పోలీసు, క్రైం రేటు, పర్యాటకం, ప్రజాప్రతినిధుల వివరాలు పొందుపరిచారు. రాష్ట్రంలోని 31 జిల్లాల ఆధారంగా వివరాలు ఇవ్వడం ఈసారి ప్రత్యేకత.


రాష్ట్రంలో వేగంగా పట్టణీకరణ పెరుగుతోందని గణాంకశాఖ వివరించింది. హైదరాబాద్ తర్వాత వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ ద్వితీయ శ్రేణి నగరాలుగా విస్తరిస్తున్నాయి. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను రాష్ట్రం ఆకర్షిస్తోందని పుస్తకం వివరించింది. పర్యాటక, వైద్య, వ్యాపార రంగాల్లో హైదరాబాద్ ప్రపంచస్థాయి గమ్యస్థానంగా విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 66.54శాతం అక్షరాస్యత నమోదైంది. పురుషుల్లో 75.04శాతం, మహిళల్లో 57.99శాతం అక్షరాస్యత ఉంది. గణాంకాల్లో కొన్ని..

### పథకాలు పెట్టినా వైద్యసేవలు అరకొరే

తెలంగాణ రాష్ట్రంలో పలు ఆరోగ్య పథకాలను ప్రవేశపెట్టినా నాణ్యతలోనూ, ప్రమాణాలలోనూ వైద్యసేవలు సరిపోయేంతగా లేవని గణాంక పుస్తకం పేర్కొంది. ఆస్పత్రుల్లో ప్రసవాలు 98శాతానికి చేరాయని వెల్లడించింది. మొత్తం 31 జిల్లాల్లో 18 జిల్లాలో ఆస్పత్రుల్లో డెలివరీలు వందశాతం ఉంటే, కొమురం భీం జిల్లాలో మాత్రం 80 శాతం జరుగుతున్నాయి. చిన్నారులకు టీకాలు రాష్ట్ర వ్యాప్తంగా 88శాతం ఉంటే, కరీంనగర్ జిల్లాలో కేవలం 39శాతమే.

శిశు మరణాలను తగ్గించటంలో తెలంగాణ చెప్పుకోదగిన పురోగతిని సాధించిందని గణాంక పుస్తకంలో పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో శిశుమరణాల్లో జాతీయ సగటు 40 ఉంటే,




### లింగ నిష్పత్తి మరీ దారుణం

తెలంగాణలో లింగ నిష్పత్తి భేదం (2011 జనాభా లెక్కల ప్రకారం) చాలా దారుణంగా ఉంది. ప్రతి వేయి మంది పురుషులకు 998 మంది స్త్రీలుంటే.. ప్రతి వేయి మంది అబ్బాయిలకు కేవలం 933మంది అమ్మాయిలే ఉన్నారు. తాజా లెక్కల ప్రకారం 25-49 వయసు గలవారిలో ఎక్కువ మంది పురుషులు, 20-44 వయసు గల మహిళలు పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా నివశిస్తున్నారు.

## బైక్‌లు ఎక్కువ ప్రమాదకారకాలు

రాష్ట్రంలో ద్విచక్ర వాహనాలు, ముఖ్యంగా బైక్‌లు ఎక్కువ ప్రమాద కారణాలుగా ఉన్నాయి. మృతుల్లోనూ ద్విచక్ర వాహనదారులే ఎక్కువ. 2015లో తెలంగాణలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలను వాహనాలవారీగా గణాంక పుస్తకం వెల్లడించింది. రాష్ట్రంలో మొత్తం 30,061 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వాటిలో 6,569 తీవ్ర ప్రమాదాలు. 11వేలు స్వల్పమైనవి. ప్రమాదాల్లో 7,110 మంది దుర్మరణం చెందారు. ద్విచక్ర వాహనం, ఆ తర్వాత కారు, బస్సు, ట్రాక్టర్ ప్రమాదాల్లో మరణించినవారే ఎక్కువ. ద్విచక్ర వాహన ప్రమాదాలు 8,123 జరగగా, వాటిలో 1,991 మంది మరణించారు. 778 వాహనాలు పాదచారులను ఢీకొట్టాయి. ఆ ప్రమాదాల్లో 248 మంది మృతి చెందారు. 2015లో 69 సైకిల్ ప్రమాదాలు జరగ్గా, వాటిలో 19మంది సైకిలిస్టులు దుర్మరణం చెందారు. మొత్తం ప్రమాదాల్లో 1,613 అతి తీవ్రమైనవిగా వెల్లడించింది.

## జనాభా కంటే మొబైల్ ఫోన్ల సంఖ్య ఎక్కువ

ఒకప్పుడు భారీ డిపాజిట్లు, లంచం లేకుండా రాని ఫోన్లు ఆ తర్వాత వచ్చిన పారదర్శక, పోటీ విధానాల వల్ల అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు తెలంగాణలో జనాభా కంటే మొబైల్స్ సంఖ్య ఎక్కువైంది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3.50 కోట్లు ఉంటే, 2016 జనవరి నాటికి మొబైల్ కనెక్షన్ల సంఖ్య 3.66కోట్లుగా నమోదైంది. రాష్ట్రంలోని పది జిల్లాలను ప్రామాణికంగా తీసుకుని ఈ లెక్క తేల్చారు.

## 12 జిల్లాల్లో మహిళలదే పైచేయి

రాష్ట్ర జనాభా 2011 లెక్కల ప్రకారం 3.50 కోట్లు. రాష్ట్రం మొత్తం మీద చూసుకుంటే స్త్రీల కంటే పురుషుల జనాభా కొంత ఎక్కువగా ఉంది. కానీ 12 జిల్లాల్లో పురుషుల కంటే స్త్రీలే ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రం మొత్తం మీద పురుషుల జనాభా 1,76,11,633 కాగా.. స్త్రీలు 1,73,92,041 మంది ఉన్నారు. రాజన్న సిరిసిల్ల, నిర్మల్, జయశంకర్, మెదక్, వికారాబాద్, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో మాత్రం పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఉన్నారు. జనగాం వంటి జిల్లాల్లో ఇరువురి సంఖ్య దాదాపు సమానంగా ఉంది.

తెలంగాణ సగటు 39 ఉండేది. కానీ దానిని 2015-16 నాటికి 34కు తేగలిగారు. అలాగే ప్రసూతి మరణాలు కూడా తగ్గాయి. ప్రసూతి మరణాల్లో జాతీయ సగటు 167 ఉంటే, రాష్ట్ర సగటు 92 మాత్రమే. కానీ, ఆదిలాబాద్ జిల్లాలో ఇంకా ప్రసూతి మరణాలు 152 ఉండటం ఆందోళనకర అంశంగా పుస్తకం పేర్కొంది.

తలసరి ఆదాయం, ఆరోగ్యం, విద్య తదితరాల ఆధారంగా నిర్ణయించే మానవాభివృద్ధి సూచికలో గత ఐదేళ్లలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు యథాతథంగా ఒకటి, రెండు స్థానాల్లో ఉంటే.. నిజామాబాద్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలు అవే స్థానాల్లో కొనసాగటం గమనార్హం. ప్రత్యేకించి ముఖ్యమంత్రి సొంత జిల్లా మెదక్ 2011-12లో ఎలాగ పదో స్థానంలో ఉందో.. తాజా లెక్కల్లోనూ అదే స్థానంలో ఉండటం గమనార్హం. ప్రభుత్వాస్పత్రుల్లో హైదరాబాద్‌లో అత్యధికంగా 7,849 పడకలుండగా, అత్యల్పంగా జోగులాంబ-గద్వాల జిల్లాలో కేవలం 184 బెడ్స్ మాత్రమే ఉన్నాయి.

### పెరిగిన తలసరి ఆదాయం

నాలుగేళ్లలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో తలసరి ఆదాయం సగటున రూ.60వేల వరకు పెరిగింది. తెలంగాణలోని మిగిలిన జిల్లాల్లో ఆ పెరుగుదల రూ.20వేల వరకు ఉంది. మొత్తంగా రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం నాలుగేళ్లలో రూ.28వేలకు పైగా పెరిగింది. 2011-12లో రాష్ట్ర ప్రజల సగటు తలసరి ఆదాయం రూ.1,12,168గా ఉండేది. కానీ 2015-16 ఆర్థిక సంవత్సరంలో సగటు తలసరి ఆదాయం రూ.1,40,683గా నమోదైంది.

రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగిన నేపథ్యంలో తలసరి ఆదాయమూ పెరిగిందని పుస్తకం పేర్కొంది. అత్యధిక తలసరి ఆదాయం గల జిల్లాగా హైదరాబాద్ (రూ.2,99,997) నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో రంగారెడ్డి (రూ.2,88,408) నిలిచింది. అత్యంత తక్కువ తలసరి ఆదాయంగల జిల్లా జగిత్యాల (రూ.77,669). ఇక 2016-17 సంవత్సరంలో ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర స్థూలోత్పత్తి (జీఎస్‌డీపీ)

| 31 జిల్లాల తలసరి ఆదాయం | | |
|---|---|---|
| జిల్లా | 2015-16 తలసరి ఆదాయం | 2011-12 తలసరి ఆదాయం |
| ఆదిలాబాద్ | 98819 | 79907 |
| కుమురంభీం ఆసిఫాబాద్ | 89947 | 72687 |
| మంచిర్యాల్ | 97677 | 79944 |
| నిర్మల్ | 91424 | 70171 |
| నిజామాబాద్ | 91738 | 71754 |
| జగిత్యాల్ | 77669 | 56636 |
| పెద్దపల్లి | 113164 | 96717 |
| భూపాలపల్లి | 96305 | 74592 |
| భద్రాద్రి-కొత్తగూడెం | 123112 | 103073 |
| మహబూబాబాద్ | 84464 | 62232 |
| వరంగల్ రూరల్ | 96076 | 72899 |
| వరంగల్ అర్బన్ | 79753 | 64038 |
| కరీంనగర్ | 101224 | 80683 |
| రాజన్న సిరిసిల్ల | 84593 | 66044 |
| కామారెడ్డి | 78853 | 60301 |
| సంగారెడ్డి | 169481 | 142331 |
| మెదక్ | 110149 | 86260 |
| సిద్దిపేట | 120909 | 93639 |
| జనగాం | 88269 | 66469 |
| యాదాద్రి-భువనగిరి | 119989 | 95161 |
| మేడ్చల్-మల్కాజిగిరి | 162327 | 139166 |
| హైదరాబాద్ | 299997 | 240777 |
| రంగారెడ్డి | 288408 | 228696 |
| వికారాబాద్ | 86865 | 65947 |
| మహబూబ్‌నగర్ | 84172 | 66319 |
| జోగులాంబ-గద్వాల్ | 85183 | 61981 |
| వనపర్తి | 83196 | 62102 |
| నాగర్‌కర్నూల్ | 81147 | 61548 |
| నల్గొండ | 108065 | 84049 |
| సూర్యాపేట | 106641 | 83367 |
| ఖమ్మం | 109975 | 82603 |

రూ.6,54,294 కోట్లుగా ఉంటుందని అంచనా వేసింది. 2011-12 స్థిర ధరల ప్రకారం 2016-17లో జీఎస్‌డీపీ రూ.5,11,286 కోట్లుగా ఉంటుందని లెక్కించింది. 2015-16 జీఎస్‌డీపీతో పోలిస్తే 10.1శాతం వృద్ధి రేటు నమోదైనట్టు పేర్కొంది. 2015-16 జీఎస్‌డీపీ రూ.5,75,631 కోట్లతో పోలిస్తే 2016-17లో వృద్ధి రేటు 13.7శాతంగా ఉంటుందని అంచనా వేసింది. అత్యధిక జీఎస్‌డీపీతో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉంది. *

# నిరుద్యోగంలో కళ్లుచెదిరే వృద్ధి



తెలంగాణలో నిరుద్యోగం పెరిగిపోతోందని, ఉపాధి అవకాశాల కోసం పల్లెల నుంచి పట్టణాలకు వలసలు పెరిగిపోతూనే ఉన్నాయని రాష్ట్ర సామాజిక అభివృద్ధి నివేదిక 2017 వెల్లడించింది. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాల్సిన అవసరాన్ని ఇది గుర్తుచేస్తోందని విశ్లేషించింది. జనాభా అంతా పట్టణాలకు తరలివస్తుండటంతో మురికివాడలు పెరిగిపోతున్నాయని హెచ్చరించింది. పట్టణ ప్రాంతాలలో లింగ నిష్పత్తి తగ్గుతుండటం, పల్లెల్లో వితంతువులు పెరిగిపోతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. దివ్యాంగుల సంఖ్య జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉందని వెల్లడించింది. సామాజికాభివృద్ధి మండలి (సీఎస్‌డీ) డైరెక్టర్ కల్పనా కన్నభిరన్ సారథ్యంలో పద్మినీ స్వామినాథన్, జయరంజన్‌లు రూపొందించిన ఈ నివేదికను ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. సీఎస్‌డీ డైరెక్టర్ ప్రొఫెసర్ ముచ్‌కుంద్ దూబే కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వివిధ దశల్లో జరిగే జాతీయ నమూనా సర్వే (ఎన్‌ఎస్‌ఎస్‌వో)తోపాటు జనాభా లెక్కల్ని విశ్లేషించి ఈ నివేదికను రూపొందించారు. (తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గణాంకాలు ఇందులో లేనప్పటికీ) సామాజిక సంక్షేమంలో రాష్ట్ర ప్రభుత్వానికి మార్గదర్శిగా ఉండేందుకు తయారుచేసిన ఈ నివేదిక కొన్ని విలువైన అంశాలను ప్రస్ఫుటంగా తెలియచేసింది..

### దూసుకెళ్తున్న నిరుద్యోగం

- 2004-05లో తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో 8శాతంగా ఉన్న నిరుద్యోగం.. 2011-12నాటికి 20 శాతానికి పెరిగింది.
- అదే కాలంలో పట్టణ ప్రాంతాలలో నిరుద్యోగం 47 నుంచి 55శాతానికి పెరిగింది.
- 2004-12 మధ్య నిరుద్యోగం ఎస్టీల్లో 3 నుంచి 6శాతానికి, ఎస్సీల్లో 17 నుంచి 29శాతానికి, ఓబీసీల్లో 15 నుంచి 28శాతానికి, ఇతరుల్లో 25 నుంచి 64శాతానికి పెరిగింది.

### టెక్నికల్ విద్య తెలియనివారు 96శాతం

- యువతలో 96శాతం మందికి సాంకేతిక విద్య అందుబాటులో లేదు. 2011-12 వివరాల ప్రకారం ఐదోవంతు మంది యువత అటు చదువుకోవడం లేదు, ఇటు పనీ చేయడం లేదు. 2004-05లో ఇది 14.5శాతం మాత్రమే.
- వీరిలో నిరక్షరాస్యులు 11శాతం
- వ్యవసాయంపై ఆధారపడినవారు 44శాతం
- తయారీరంగంపై ఆధారపడినవారు 15శాతం
- వ్యాపారం, హోటల్ రంగంలో 11శాతం
- ఏ పనిలోనూ అనుభవంలేనివారు 76శాతం
- 2004-05లో విద్యావంతులు కాని యువత సంఖ్య 30శాతం కాగా, 2011-12 నాటికి అది 11శాతానికి తగ్గింది. 62శాతం మంది సెకండరీ స్థాయి కంటే ఎక్కువ చదువుకొన్నందున వీరికి సాంకేతిక విద్యను అందించాల్సి ఉంది.

### కార్డులున్నవారిలో 32శాతం పనికి వెళ్లడం లేదు

దేశ సగటుకన్నా తెలంగాణలో ఉపాధిహామీ కార్డులు ఎక్కువగానే ఉన్నా.. ఈ కార్డులున్నవారిలో 32శాతం మంది ఆ పనికి వెళ్లడం లేదు. ఆదిలాబాద్ జిల్లాలో 87శాతంమందికి జాబ్ కార్డులుండగా వీరిలో 71శాతం మంది పనికి వెళ్లడం

## విద్య, వైద్యం ఆందోళనకరం: మానవాభివృద్ధి నివేదిక

రాష్ట్రంలో ప్రభుత్వరంగంలో విద్య నాణ్యత తగ్గుతోందని 2017లో విడుదల చేసిన తెలంగాణ మానవాభివృద్ధి నివేదిక కూడా ఆందోళన వ్యక్తం చేసింది. మానవవనరులను అభివృద్ధి చేసి అసమానతలను తొలగిస్తేనే అభివృద్ధి వేగమందుకుంటుందని పేర్కొంది. హైదరాబాద్‌లోని ఆర్థిక, సామాజిక అధ్యయన సంస్థ (సెస్) రూపొందించిన తుది నివేదికను ఇటీవల ప్రభుత్వానికి అందచేశారు. సెస్ డైరెక్టర్ ఎస్.గాలబ్ నేతృత్వంలో సి.రవి, ఇ.రేవతి, ఎన్.శ్రీదేవి, సి.అపర్ణలతో కూడిన బృందం ఈ అధ్యయనం చేసింది. బడి మానేసే పిల్లల సంఖ్య అన్ని జిల్లాల్లో తగ్గినా, ఇప్పటికీ వీరి సంఖ్య ఎక్కువగానే ఉందని తెలిపింది. ఎస్టీల్లో 35శాతం ఉంది. మానవాభివృద్ధిలో ముందున్న హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో సరాసరిన ఏడుగురు ఉపాధ్యాయులు ఉండగా, ఇతర జిల్లాల్లో ఐదుగురే ఉన్నారు. విద్యారంగానికి నిధులు పెరుగుతున్నా ఆ స్థాయిలో ప్రమాణాలు లేవు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెంటిలోనూ ప్రైవేటు ఆసుపత్రుల మీదే ఎక్కువగా ఆధారపడుతున్నారని నివేదిక తెలిపింది. జాతీయ సగటు కంటే కూడా తెలంగాణలో ప్రైవేటు దవాఖానాల జోరు కొనసాగుతోంది. దీనివల్ల వైద్యసేవలు భారంగా మారాయి. అలాగే జాతీయ స్థాయిలో 1600 మంది జనాభాకు ఒక వైద్యుడు అందుబాటులో ఉంటే తెలంగాణలో 8వేల మందికి ఒకరున్నారు. ఆరోగ్య ఉపకేంద్రాలు, పీహెచ్‌సీలు, సామాజిక వైద్యశాలల్లో మౌలిక వసతుల, సేవల కొరత ఉంది.

లేదని నివేదికలో వెల్లడైంది. వరంగల్, నిజామాబాద్‌లో 50శాతంకన్నా తక్కువ పని జరిగినట్టు తేలింది.

### వైద్యానికి భారీ ఖర్చు

తెలంగాణలోని గ్రామీణ ప్రాంత ప్రభుత్వాసుపత్రుల్లో సరైన సౌకర్యాలు లేవు. ఉన్న ఆసుపత్రులు కూడా తక్కువే. రాష్ట్రంలోని 108 జనరల్ ఆసుపత్రుల్లో 21, 17 స్పెషాలిటీ ఆసుపత్రుల్లో 10 హైదరాబాద్‌లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. హైదరాబాద్ మినహా వరంగల్‌లో కొంత మెరుగైన వైద్యవ్యవస్థ ఉంది. దీంతో ప్రయివేటును ఆశ్రయించాల్సి రావటంతో గ్రామీణ తెలంగాణలో వైద్య ఖర్చు భారీగా పెరిగింది. జాతీయ సగటు ప్రకారం వైద్యానికి గ్రామీణ ప్రాంతాల్లోని ఒక్కో కుటుంబం రూ.16,596 ఖర్చు చేస్తుండగా, తెలంగాణలో రూ.21,683గా ఉంది. పట్టణాల్లో ఈ ఖర్చు రూ.22,584గా ఉంది.

పిల్లల వైద్య ఖర్చులు కూడా ఎక్కువగానే ఉన్నాయి. సగటున గ్రామాల్లో రూ.13,320, పట్టణాల్లో రూ.18,969గా ఉంది.

తెలంగాణలో వైద్య ఖర్చులకు ప్రజల్లో అత్యధికులు ఎలాంటి ఇన్సూరెన్స్‌లు పొందడం లేదు.

ఆసుపత్రుల్లో పుట్టే పిల్లల సంఖ్య పట్టణ ప్రాంతాల్లో 96శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 87శాతంగా ఉంది. కానీ అనవసర సిజేరియన్లు చేస్తున్నారు.

వైద్యరంగంపై రాష్ట్ర ప్రభుత్వ శ్రద్ధ తక్కువేనని నివేదిక అభిప్రాయపడింది. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తక్కువేనని తెలిపింది. తెలంగాణలో కేవలం 4863 ఉపకేంద్రాలు, 668 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), 114 సీహెచ్‌సీలు ఉన్నాయి. అదే కర్ణాటకలో 9246 ఉపకేంద్రాలు, 2353 పీహెచ్‌సీలు, 206 సీహెచ్‌సీలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రులకు సరైన భవనాలు కూడా లేవని, రాష్ట్రంలోని 2438 సబ్‌సెంటర్లు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయని నివేదిక పేర్కొంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సర్జన్, గైనకాలజిస్ట్, ఫిజీషియన్ తదితర నిపుణుల కొరత భారీగా ఉందని తెలిపింది.

### ప్రభుత్వ విద్యకు సత్తువ లేదు

సామాజికంగా, ఆర్థికంగా నిర్లక్ష్యానికి గురైన సామాజిక తరగతులు ప్రభుత్వ విద్యాసంస్థలపై ఎక్కువ ఆధారపడి ఉన్నాయి. కానీ ప్రభుత్వ విద్యలో ప్రమాణాలు కొరవడటం వారికి ఆశించిన ప్రయోజనం చేకూరటం లేదు. నమూనా సర్వేలో పాల్గన్నవారిలో సుమారు 14శాతం ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేసుకోలేదు. నమోదు చేసుకున్నవారిలో కూడా మూడోవంతు మంది మాత్రమే చదువు పూర్తి చేశారు. మెదక్ జిల్లా హ్యూమానిటీస్‌కి కేంద్రంగా ఉంది. ఇందులో ఉన్న విద్యార్థుల్లో ఎక్కువమంది ఎస్సీలకు చెందినవారు.

### 25శాతం బాల్యవివాహాలు

తెలంగాణలో నేటికీ బాల్యవివాహాలు జరుగుతున్నాయి. 25.7శాతం మంది మహిళలు బాల్యవివాహాలు చేసుకుంటున్నట్టు వెల్లడైంది. ఈ విషయంలో మహబూబ్‌నగర్

జిల్లా (45.6శాతం) మొదటిస్థానంలో ఉండగా, రెండోస్థానంలో నల్లగొండ (36.8శాతం), చివరిస్థానంలో నిజామాబాద్ (10.5శాతం) నిలిచాయి. ఆశ్చర్యకరంగా, హైదరాబాద్ చుట్టుపక్కల పట్టణ ప్రాంతాలలో కూడా బాల్యవివాహాలు అధికంగా ఉన్నాయి.

**వితంతువులు పెరిగిపోతున్నారు**

మద్యం బెల్టుషాపులకు వ్యతిరేకంగా 2007లో లోక్‌సత్తా ఆందోళనలు చేపట్టాక ఎన్డీటీవీ ప్రతినిధి ఉమా సుధీర్ అక్కడ 'లిక్కర్ విడోస్..' పేరుతో ఒక డాక్యుమెంటరీని రూపొందించారు. అందులో వరంగల్ గ్రామీణ ప్రాంతాలలో మద్యం బారిన పడి భర్తలు మరణించటంతో చిన్న వయసులోనే వైధవ్యం పొందిన మహిళల దయనీయ గాథల్ని చిత్రీకరించి ప్రభుత్వం, సమాజం దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ప్రస్తుత నివేదికలోని వివాహితులు, వితంతువుల గణాంకాలు చూస్తే సామాజికంగా ఆలోచించాల్సిన అలాంటి కోణాలెన్నో కనిపిస్తున్నాయి.

20–29 వయో విభాగంలో 46శాతం మంది పురుషులు మాత్రమే వివాహితులు

- 60 ఏళ్లు పైబడినవారిలో 87శాతం మంది పురుషులు వివాహితులుగా ఉన్నారు
- 60 ఏళ్ల వయసు దాటినవారిలో వితంతువులైన మహిళలు 57శాతం ఉన్నారు. పురుషుల్లో జీవిత భాగస్వామి లేనివారి సంఖ్య కేవలం 11శాతం. భాగస్వామి చనిపోతే పునర్‌వివాహాలు చేసుకోవడం పురుషుల్లో ఎక్కువ, మహిళల్లో తక్కువగా ఉండటమే ఇందుకు కారణమా అనేది కూడా ఆలోచించాలని నివేదిక పేర్కొంది.
- జనాభాలో దివ్యాంగుల శాతం జాతీయస్థాయిలో 2.2కాగా, తెలంగాణలో 3శాతంగా నమోదైంది. ముఖ్యంగా గ్రామీణ తెలంగాణలో దివ్యాంగులు ఎక్కువగా ఉన్నారు.

**గృహనిర్మాణం మెరుగ్గా ఉంది**

జాతీయస్థాయితో పోలిస్తే తెలంగాణలో గృహవసతి మెరుగ్గానే ఉంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో 21శాతంమందికి పక్కా ఇళ్లు లేవు. ఇందులో కూడా ఎస్సీ కుటుంబాలకు 79.6శాతంమందికి లేవు.

- రాష్ట్రంలో విద్యుత్ అందుబాటు బాగుంది. మెదక్ జిల్లా మాత్రం వెనకబడి ఉంది.

- గ్రామీణ ప్రాంతాలలో మురుగునీటిపారుదల వ్యవస్థ సరిగా లేదు. రాష్ట్రంలో 29శాతం కుటుంబాలకు చెత్త వేయడానికి ఏర్పాట్లు లేవు.

**పదోవంతు మందికి కంప్యూటర్లు**

నమూనా సర్వే ప్రకారం రాష్ట్రంలో పదోవంతు కుటుంబాలకు కంప్యూటర్లు ఉన్నాయి. హైదరాబాద్‌లో 26శాతం, రంగారెడ్డి జిల్లాలో 19శాతం ఉండగా, మిగిలిన జిల్లాల్లో 10శాతం కంటే తక్కువగా ఉన్నాయి. కంప్యూటర్లున్న కుటుంబాలలో స్త్రీ, పురుషులకు కూడా వీటి పట్ల అవగాహన మెరుగ్గా ఉంది.

- వివిధ రంగాలలో పనిచేసే కార్మికుల సంఖ్య జాతీయ సగటు కంటే తెలంగాణలో ఎక్కువ. అయితే 2011–12లో జాతీయస్థాయిలో తగ్గినట్టే తెలంగాణలో తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ, అందులోనూ మహిళల్లో పనిచేసేవారి సంఖ్య తగ్గిందని నివేదిక తెలిపింది.

**వృద్ధుల జనాభా పెరుగుదల**

రాష్ట్ర జనాభాలో 60ఏళ్లు పైబడినవారి సంఖ్య పెరిగింది. పదేళ్లలో తెలంగాణ జనాభాలో వృద్ధుల సంఖ్య 7.4 నుంచి 9.3శాతానికి పెరిగింది. ఇందులోనూ తాతల కంటే అవ్వల సంఖ్య ఎక్కువ.

- 0–4, 5–9 వయో విభాగాల్లో చిన్నారుల నిష్పత్తి అన్ని ప్రాంతాలు, సామాజికవర్గాల్లో తగ్గింది

- పట్టణ ప్రాంతాలైన రంగారెడ్డి, హైదరాబాద్‌లలో లింగనిష్పత్తి అసమానతలు పెరిగాయి.

- ఆరేళ్లలోపు చిన్నారుల్లో ఈ నిష్పత్తి దశాబ్దకాలంలో 957 నుంచి 933కు చేరటం ఆలోచించాల్సిన విషయం. లింగనిష్పత్తి ఆందోళనకరంగా ఉన్న జిల్లాల్లో హైదరాబాద్, నల్గండ, వరంగల్, మహబూబ్‌నగర్ ఉన్నాయి.

**ప్రైవేటు రుణమే దిక్కు**

బ్యాంకు రుణం తెలంగాణలో పేదలకి ఇంకా అందని పండులాగానే ఉంది. కేవలం సొంత ఆస్తి ఉన్నవారికే బ్యాంకులు తక్కువ వడ్డీకి అప్పులిస్తున్నాయి. దీంతో పల్లెల్లో, పట్టణాల్లో కూడా ప్రైవేటు వడ్డీ వ్యాపారుల హవా నడుస్తోంది. ఏ అవసరమొచ్చినా, భారీ వడ్డీ రేట్లకు అప్పులిచ్చి ఆ తర్వాత ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారులు సగటున 9నుంచి 28శాతం వరకు వడ్డీని వసూలు చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారుల నుంచి దీర్ఘకాలిక రుణాలు పొందుతున్నవారిలో రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. రాష్ట్రం

మొత్తం మీద 70.7శాతం మంది అప్పు చేస్తున్నారు. 77శాతం మందికి బ్యాంకు ఖాతాలున్నాయి. రుణాలు పొందలేనివారు 30శాతం దాకా ఉన్నారు. ఎస్సీ, ఓబీసీలు 55శాతం మేర రుణాల్ని వడ్డీవ్యాపారుల నుంచే పొందుతున్నారు. గిరిజనుల్లో ఈ శాతం 48. వ్యవసాయ రుణాలు 46.8శాతం నుంచి 60శాతంపైనే. రుణాల విషయంలో కూడా గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య భారీ అంతరాలున్నాయి.

**ఇంకా..**

❑ తెలంగాణ జనాభాలో 61శాతం ఇప్పటికీ పల్లెల్లోనే నివసిస్తున్నారు. అయితే రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. పదేళ్లలో పట్టణ జనాభా 38శాతం పెరిగింది. పల్లెల్లో వృద్ధి 2శాతమే నమోదైంది.

❑ పట్టణాభివృద్ధి ఫలితంగా తెలంగాణలో ఈ పదేళ్లలో టౌన్లు 82 నుంచి 158కి (93శాతం వృద్ధి) పెరిగాయి

❑ పట్టణ జనాభాలో 30శాతం ఒక్క హైదరాబాద్‌లోనే నివాసముంటున్నారు

❑ రాష్ట్రంలో 18శాతం కుటుంబాలు మంచినీటికి క్యాన్ల మీదే ఆధారపడుతున్నాయి. ఎస్సీలు, ఆ తర్వాత ఎస్టీ కుటుంబాలకు తాగునీటి వసతి అధ్వాన్నంగా ఉంది.

❑ రాష్ట్రంలో 28శాతం మందికి ఇళ్లల్లో స్నానాల గది సౌకర్యం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీల్లో ఎక్కువ. ఇళ్లు చిన్నవి కావడం, ప్రాథమిక వసతులు లేకపోవడాల్ని ఇది సూచిస్తుంది. దాదాపు 40శాతంమందికి మరుగుదొడ్డి సౌకర్యం లేదు. *

## అక్రమ ప్లాట్ల విక్రేతలపై చర్యకు డిమాండ్






రాయదుర్గం పట్టణ పరిధిలో అనంతపురం రహదారి పక్కన సర్వే నెంబర్ 332, 332/1, 332/2, 332/1సిలలో అక్రమ, అనధికార లే అవుట్లలో ఫ్లాట్లను విక్ర యించ రాదని మునిసి పల్ అధికారులు నోటీసులు పెట్టినా విక్రయిస్తు న్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బి.వెంకటరమణ మునిసిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు మునిసిపల్ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో కలిసి విజ్ఞాపనను అందచేశారు. ఇదివరకు తాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు మునిసిపల్ అధికారులు నోటీసు బోర్డును ఏర్పాటు చేసినా.. కొందరు ఆ బోర్డులోని అక్షరాలు కనిపించకుండా పెయింట్‌తో తుడిపారన్నారు. పూర్తి విచారణ కోసం పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. *

## 'సిట్' నివేదికను బైటపెట్టాలి




విశాఖపట్నంలో, జిల్లాలోని పలు చోట్ల పెద్దఎత్తున జరిగిన భూముల కుంభకోణంపై వేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇచ్చిన నివేదికను తొక్కిపట్టటాన్ని నిరసిస్తూ జిల్లా లోక్‌సత్తా నేతలు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. *

# సమాజహితం కోరేవారైతేనే సివిల్స్‌కు సిద్ధంకండి: జేపీ




- మనతోపాటు దేశం, సమాజం బాగుపడాలన్న స్పృహను పెంచుకోవాలి
- రాజకీయ నాయకుల జోక్యంతో సమర్థంగా పనిచేయలేకపోయామనే అధికారుల మాటలు పచ్చి అబద్ధాలు
- రాజకీయ నేతలు, బ్యూరోక్రాట్లు, న్యాయవ్యవస్థ సరిగా పనిచేయకపోవడం వల్లే విద్య, వైద్యంలాంటి రంగాలు దేశంలో అధ్వాన్నంగా తయారయ్యాయి
- తల్లిదండ్రుల చదువు, ఆదాయం, కులాలను బట్టి దేశంలోని 80 శాతం కుటుంబాల్లోని పిల్లల జీవితం నిర్ణయమవుతోంది
- భావప్రకటన, భాష, గణిత కాన్సెప్ట్స్, లాజికల్స్‌పై 2009లో 74 దేశాల మధ్య సర్వే చేయగా, మనదేశ పాఠశాల విద్యార్థులు 73వ స్థానంలో ఉన్నారు
- అత్యుత్తమ విద్యాప్రమాణాలతోనే దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యం
- దేశంలో వ్యవస్థీకృత మౌలిక మార్పుల్ని తీసుకొచ్చినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి
- సాంకేతికత వినియోగంతోనే మార్పును వేగంగా సాధించగలం. అయితే అందులో సెలెక్టివ్‌గా, నిర్మాణాత్మకంగా ఉండాలి
- సేవ చేసేందుకు సివిల్ సర్వెంట్లే కానక్కర్లేదు.. సమాజం పట్ల విజ్ఞత ఉంటే చాలు
- బండి గమ్యం చేరడానికి మంచి డ్రైవర్, ఇంజిన్, ట్రాక్ ఎంత అవసరమో.. లక్ష్యాలను సాధించుకోవడానికి అలాంటి పరిస్థితులను సృష్టించుకోవడం అవసరం
- ఆత్మవిశ్వాసం, మంచి ప్రణాళిక, నిబద్ధతలతోనే లక్ష్యసాధన సాధ్యం



సమాజహితం కోరటమంటే అంతిమంగా మన హితాన్ని మనం కోరుకోవటమేనని, ఈ వాస్తవాన్ని గుర్తించి జనహితం కోసం పనిచేయగలిగినవారే సివిల్స్‌కు సిద్ధం కావాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

“సమాజంలో మార్పు కోసం నేను వైద్య వృత్తిని వదిలి ఐఏఎస్ అధికారిగా పనిచేయవలసి వచ్చింది. ఐఏఎస్‌గా నేను ఎంత పెద్ద సక్సెస్ అయినా.. నేను నిర్దేశించుకున్న లక్ష్యాల్లో 30 శాతం మాత్రమే సాధించగలడంతో ఐఏఎస్ పదవిని వదులుకుని సమాజసేవకు ఉద్యమించా. జీతం, హోదా లేకుండా ప్రస్తుతం ఐఏఎస్ అధికారి చేసే పనులే చేస్తున్నా” అని జేపీ అన్నారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, భారతీయ వ్యవసాయ పరిశోధనామండలి సౌజన్యంతో ‘సివిల్స్‌కు ఎలా సన్నద్ధం కావాలి?’ అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడిన అనంతరం వారి ఆలోచనలను తెలుసుకునేందుకు జేపీ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అందులో విద్యార్థులు అడిగిన కొన్ని ప్రశ్నలకు ఆయన జవాబులు..

**(?) సివిల్స్‌పై అంత మోజు ఎందుకు**

జేపీ: పదవి, ఉన్నత హోదా, సమాజంలో ఉన్నతస్థానం లభిస్తుందన్న భ్రమ ఎక్కువమందిలో కనిపిస్తుంది. ఐఏఎస్ పదవి అనేది కచ్చితంగా ఉన్నతమైన పదవే. అందులోకి పరిమిత సంఖ్యలో మాత్రమే ప్రవేశం ఉంటుంది. దాని కోసం ఏళ్ల తరబడి అన్నీ వదులుకుని పట్టుదలతో చదవాల్సిన అవసరం లేదు. వృత్తి ఏదైనా సమాజానికి ఏదైనా చేయాలన్న తపన యువతలో ఉంటే చాలు. సివిల్స్‌లో నెగ్గినవాడు గొప్పవాడు కాదు, ఓడిన వాడు తక్కువ కాదు అని గుర్తించాలి. మన వలన సమాజానికి ఏమి జరిగిందో, ప్రజల జీవన స్థితిగతుల్లో ఎలాంటి మార్పు వచ్చిందో తెలుసుకుంటుంటే చాలు.

**(?) సివిల్స్ పరీక్షను ఎలా నెగ్గాలి**

యూపీఎస్సీ ప్రకటనలో పూర్తి వివరాలు ఉన్నాయి. మారిన నిబంధనలు ఎప్పటికప్పుడు ప్రకటనలో పొందుపరుస్తారు.

అవినీతికి ఆస్కారం లేని యూపీఎస్సీ ప్రతిభకు పట్టం కడుతుందన్న నమ్మకం ఉంది. నేను ఓ లక్ష్యంలో భాగంగా అనుకోకుండా సివిల్స్‌కి ఎంపికయ్యాను. సివిల్స్‌కి హాజరయ్యేవారికి భాష సమస్య లేదు. పరీక్షల్లో భావం ముఖ్యం. ప్రాథమిక పరీక్షలో అన్ని అంశాలు ఉన్నప్పటికీ, మెయిన్స్‌లో ఐచ్ఛికాలు చాలా ముఖ్యం. సమగ్రంగా అవగాహన ఉన్న సబ్జెక్టును ఎంచుకుంటే సరిపోతుంది. గతంలో రెండు సబ్జెక్టులను ఎంచుకునేవారు. ప్రస్తుతం ఒక్క సబ్జెక్టుపై పట్టు సాధిస్తే చాలు.

**(?) ఉన్నతమైన ఐఏఎస్‌ను ఎందుకు వదులుకున్నారు**

రాజ్యాంగ విలువలకు-ప్రజల జీవితానికి మధ్య ఉన్న అగాధాన్ని తొలగించి, ఆ విలువల్ని జనజీవితంలో భాగం చేయాలన్న లక్ష్యంతో ఐఏఎస్ అధికారిగా కష్టపడ్డాను. జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా, వివిధ సంస్థల ఉన్నతాధికారిగా పనిచేసిన సమయంలో ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలను చేపట్టాను. లక్షలమందికి లబ్ధి చేకూర్చేలా ప్రణాళికలు వేసి అమలు చేశాను. ఇందుకోసం ఎన్నో విషయాల్లో కొత్తపుంతలు తొక్కాను. వెనక్కి తిరిగి చూసుకుంటే.. నేను చేసింది కొంతే అనిపించింది, చేయాల్సింది ఎంతో కనిపించింది. వాస్తవ పరిస్థితుల్ని విస్తృతంగా, లోతుగా అధ్యయనం చేయగలిగాను. పరిమితులను విధించే పరిస్థితుల కారణంగా గమ్యాన్ని చేరుకోవడంలో ఆలస్యం చోటుచేసుకుంటుండటంతో పదవిని వదులుకున్నా. కోరుకున్న లక్ష్య సాధన కోసం నిద్రాహారాలు మాని శ్రమిస్తున్నాను.

**(?) యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం ఎలా ఉంది**

అంతర్జాలం (ఇంటర్‌నెట్)ను ఎంత సద్వినియోగం చేసుకుంటే అంత మంచిది. దుర్వినియోగం చేసుకుంటే మాత్రం అంతకు మించిన దౌర్భాగ్యం లేదు.

**(?) సమాజంలో అభివృద్ధి కోసం ఏమి చేయాలి**

అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్య ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చు. దేశంలో పాఠశాల విద్య బలహీనంగా ఉంది. 2009లో 'పీసా' అనే సర్వేలో 74 దేశాల మధ్య పాఠశాల విద్య పటిష్టతపై సర్వే నిర్వహించగా అందులో మనదేశం స్థానం 73. ప్రభుత్వం దీనిని దృష్టిలో ఉంచుకుని నష్టనివారణ చర్యలు చేపడుతుందని ఆశించగా.. అందుకు విరుద్ధంగా దేశంలో ఆ తరహా సర్వేలనే నిషేధించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కో విద్యార్థి పాఠశాల విద్యకు ప్రభుత్వం రూ.70,000 ఖర్చు చేస్తున్నా.. నాణ్యత నామమాత్రంగానే కనిపిస్తోంది. వ్యక్తిహితమే సమాజహితం అనే భావన తొలగాలి.

**(?) అధికారులపై రాజకీయ నాయకుల ప్రభావం ఎక్కువగా ఉందా**

అధికారులపై రాజకీయ నాయకుల ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నది పచ్చి అబద్ధం. రాజకీయ ప్రభావం కొంతమేరకు ఉన్నా.. అది నియంత్రించే స్థాయిలో ఉండదు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం లేనిదే ఏ పనీ జరగడం లేదు. పాఠశాలల్లో సరైన విద్యను అందించలేకపోతున్నారు. ఆస్పత్రుల్లో సరైన వైద్యానికి దిక్కులేదు. ఇవన్నీ రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లంగి చేస్తున్న తప్పిదాలు అనగలమా? కొందరు అధికారులు తమ హోదాని దుర్వినియోగం చేస్తూ ఇలా రాజకీయ నాయకుల పేర్లు చెప్పుకుంటూ బతుకుతున్నారు. అధికారుల విజ్ఞతపైనే వ్యవస్థ పనితీరు ఆధారపడి ఉంటుంది.

**(?) మహిళలు, బాలికలపై అత్యాచారాలు నియంత్రించలేమా?..**

నిర్భయ, అసిఫా కేసులు గురించి వింటే సమాజంలో మానవీయ విలువలు ఎంత దిగజారుతున్నాయోనన్న ఆందోళన పెరుగుతుంది. సమాజంలో మహిళల్ని తక్కువ చేయడం, వేధించడం ఒక భాగమైంది. ప్రత్యేక చట్టాలు, ఆర్డినెన్స్ వచ్చినా ఫలితం శూన్యం. మహిళల్ని వేధించేవారు, తక్కువ చేసేవారు ఇతర దేశాల నుంచి వచ్చినవారు కాదు, మన కుటుంబాల నుంచి వచ్చినవారే ఇలా చేస్తున్నారు. 'స్థానిక న్యాయాలయాల'ను ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ కేసులను వారం రోజుల్లో పరిష్కరించాలి. తప్పు చేసిన వారి నుంచి అపరాధ రుసుములు వసూలు చేయడంతోపాటు తప్పు పునరావృతమైతే కఠినంగా చర్యలు చేపట్టడం ద్వారా కట్టడి చేయవచ్చు.

ఈ సందర్భంగా సావనీర్‌ను ఆవిష్కరించారు.

వీసీ హరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ అఫైర్స్ కె.సర్జన్‌రావు, వెటర్నరీ డీన్ డాక్టర్ టీఎస్ చంద్రశేఖరరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.నళినికుమారి, సదస్సు కోఆర్డినేటర్, ఓఎస్‌ఏ డాక్టర్ బి.రాంబాబు నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. *



# యానాం ప్రజలకున్న విజ్ఞత అన్ని ప్రాంతాలవారికీ ఉండాలి

జనహితానికి ఏం చేయాలి అని ఆలోచించి అందుకు పాటుపడే వ్యక్తి మల్లాడి కృష్ణారావు అని, అలాంటి మంచి నాయకత్వాన్ని పెంచే ప్రయత్నాన్ని చేస్తున్న యానాం ప్రజలకున్న విజ్ఞత దేశంలోని అన్ని ప్రాంతాలవారికీ ఉండాలని ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు.


పుదుచ్చేరి ఆరోగ్య శాఖా మంత్రి మల్లాడి కృష్ణారావు రెండేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భాన్ని, ఆయన 55వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని యానాంలో నిర్వహించిన కార్యక్రమాల్లో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులకు పునాదిరాళ్లు వేశారు.

దేశంలో ఇంకా ప్రజాస్వామ్యం బతికుందంటే అది కృష్ణారావు లాంటి నాయకుల వల్లేనని జేపీ అన్నారు. యానాం ప్రజల్లా... తమ జీవితానికి-మంచి నాయకత్వానికి  ఉన్న సంబంధాన్ని దేశ ప్రజలు విచక్షణా జ్ఞానంతో అర్థం చేసుకుని ఓటు వేస్తేనే నిజమైన ప్రజాస్వామ్యం పెరుగుతుందన్నారు.

ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు ఇబ్బందుల పాలు చేయటం అప్రజాస్వామికమని పుదుచ్చేరి ఎల్‌జీ కిరణ్‌బేడీనుద్దేశించి జేపీ పరోక్షంగా అన్నారు. రాజ్యాంగం ద్వారా వచ్చిన పదవుల్లో ఉన్నవాళ్లు రాగద్వేషాలకు, కులమతాలకు అతీతంగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని గుర్తించాలన్నారు. ప్రజల నుంచి నాయకత్వం పెరుగుతుందని, కొన్ని పద్ధతులను అనుసరిస్తే ప్రజాస్వామ్యం బలపడుతుందని అన్నారు. ఇతరుల నుంచి మంచిని నేర్చుకోవటం ద్వారానే మానవజాతి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్, మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, నాయకులకు కేవలం పెద్ద చదువుల డిగ్రీలు ఉంటే చాలదని, చిత్తశుద్ధి, ప్రజలకు సేవ చేయాలనే తపన కూడా ఉండాలని అన్నారు. చట్టసభల్లో మహిళలు, వెనకబడిన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలన్న అంబేద్కర్ ఆకాంక్ష నెరవేరాలని స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఐపిఎస్  పి.ఎస్.ఎన్ మూర్తి అన్నారు. యానాం ప్రజల నమ్మకాన్ని ఎప్పుడూ వమ్ము చేయనని, ప్రజాసేవకే తన జీవితం అంకితమని మల్లాడి అన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, జయప్రకాష్ నారాయణ్ లాంటి నేతలను సభకు ఆహ్వానించటం ప్రజల్లో స్ఫూర్తినింపడానికేనని అన్నారు. పుదుచ్చేరి కాంగ్రెస్ ఇంఛార్జి, వనపర్తి ఎమ్మెల్యే చిన్నారెడ్డి, అంబేద్కర్ చిత్ర నిర్మాత డాక్టర్ పి. పద్మావతి, ముమ్మిడివరం వైసీపీ నేత పొన్నాడ వెంకట సతీష్ కుమార్, యర్రా సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు. వాన పడుతున్నా యానాం పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు.

Posting Date 22-06-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on June 16th, 2018






# సరిగ్గా 125 ఏళ్ల క్రితం ఇదే నెలలో....

జాతి వివక్ష కారణంగా నూట పాతికేళ్ల క్రితం జూన్ 7, 1893న దక్షిణాఫ్రికాలోని పీటర్ మారిట్జ్‌బర్గ్ రైల్వేస్టేషన్‌లో ఎం.కె గాంధీని ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ నుంచి గెంటేశారు. ఆ సంఘటన ఆయన జీవితాన్నే మార్చివేసింది. జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందిని ప్రభావితం చేసిన గాంధీ అహింసా ఉద్యమానికి ఆరోజే బీజం పడింది... ఈ వివరాల సందేశంతో రైల్వేస్టేషన్ వద్ద ఓ శిలాశాసనాన్నే లిఖించారు. అన్నట్టు, గాంధీజీని అవమానించిన పీటర్ మారిట్జ్‌బర్గ్ రైల్వేస్టేషన్ పేరును కూడా ఆయన 142వ పుట్టినరోజున 'గాంధీ రైల్వేస్టేషన్'గా మార్చారు.

Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad